# HANNA KRUPA®

**Christian Devotional Monthly Magazine**

**సంపుటి : 10** **సంచిక : 5**


ప్రభువగు యెహోవాయే నాకు బలము

## విషయసూచిక


| | | |
|---|---|---|
| జీవనమంతయు... | ఛీఫ్ ఎడిటర్ | 3 |
| దివ్య బ్రాహ్మణుడు.... | గుండాబత్తిని | 4 |
| ప్రజాపతి బలియాగం | రెవ.జె.లాజరస్, జమ్మలమడుగు | 6 |
| సునాద సంవత్సరము | హన్నాకృప డెస్క్ | 8 |
| బస్సులో నుండి దింపిన దేవుడు | సిస్టర్ .సువార్త కేరి, కావలి | 9 |
| జ్ఞాపకాలు | హన్నాకృప డెస్క్ | 10 |
| ఫాదర్ హయ్యర్ | ప్రొ ॥ టి.యస్.వి. ప్రసాదరావు, గుంటూరు | 12 |
| నవంబర్ నెల ప్రశ్నలు | శ్రీ పంతగాని గ్రేషియస్, ఏలూరు | 15 |
| విశ్వాసంలో మరో మెట్టు | కొడవటికంటి | 16 |
| ఆయన చేసిన ఉపకారములు | హన్నాకృప డెస్క్ | 18 |
| కీ॥శే॥ వై . యస్. చిన్న కొండారెడ్డి, | | 20 |
| శ్రమల కొలిమి | రత్నకుమారి హానోకు, ఇబ్రహీంపట్నం | 22 |
| శతాధిక తెలుగు బాపిస్టు సంఘము | రెవ.రావూరి కృపారావు, బాపట్ల | 24 |
| బైబిల్‌లోని కిరీటములు | శ్రీమతి ఆలూరి నిర్మలా మాధ్యూస్ | 25 |
| The Personal Word | రూడి లాక్ | 25 |
| లోకం తీరు | కె.ఇమ్మానియేల్‌రాజేంద్ర | 26 |
| నీ తల్లిని నీ తండ్రిని సన్మానింపుము | హన్నాకృప డెస్క్ | 27 |
| యేసు కథ | కొడవటికంటి | 28 |
| దేవునికి కోపము పుట్టించిన.... | బ్ర ॥ డి. అబ్రహాం శామ్యూల్ శర్మ | 29 |
| న్యూస్ | హన్నాకృప డెస్క్ | 30 |



**కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర**

చీఫ్ ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ - 51, డోర్ నెం.54-1-23(ఎ)

కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు-523 001

9866716506


**సంవత్సర కానుక : రూ. 200/-**

**ప్రియపాఠకులారా మీరు పంపే కానుక 500/- మించినప్పుడే ఆన్‌లైన్‌లో వేయండి.**


Editor :

**Rev. Nathaniel R. Kodavatikanti,**
B.Th.,M.A.,M.Phil

Cell : 9908822365

Hon. Editor :

**Rev. K. Vijaya Chandra**

Pastor, Hannahkrupa Memorial Church
Bangalore

Hon. Advisor :

**Yadavalli Prasada Rao**

Pay & Accounts Officer, Warangal

Patrons :

**Dr. Y.S. Purushotham Reddy**

Superintendent, Sri Rajareddy Hospital
Pulivendula

**Bishop.Rev. Dr. M.S. Santhavardhan**

Director, Good News Messengers, Guntur

**Dr. Pikkili Hussenaiah**

Sri Parvathi Nursing Home, Besthavaripeta


ఆన్‌లైన్ అకౌంట్ నెం. : **10957294362**
బ్రాంచి నెం. : 0890 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అకౌంట్ హోల్డర్ : కె. సామ్యేల్ రాజేంద్ర, కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు సెల్ : 9866716506

# జీవనమంతయు...



మరియు దేవుడైన యెహోవా నరుని తీసుకొని ఏదెను తోటను సేద్యపరచుటకును, దాని కాచుటకును దానిలో ఉంచెను. దేవుడు మానవుని సృజించకముందే అతనికి కావలసివన్నియు అతనికి సిద్ధపరచాడు. భూమికి, సూర్యునికి, సముద్రానికి ఆయన కట్టడను నియమించాడు. అలాగే మానవుని మనుగడకు అతడు భూమిని సేద్య పరచాలి.

అలా సేద్యపరచటములోనే అతని శరీరానికి ఆరోగ్యము, మనసుకు ఆనందం నియమించాడు. తోటలో పండ్లు విస్తారముగా ఉన్నవి. వాటిని నిరబ్యంతరముగా తిన మన్నాడు. అయితే సేద్యము చేసి తినాలి.

మనిషి జీవించటానికి ఆహారము అవసరము. ఆ ఆహారము అతనికి పైనున్న ఆకాశము నుండి దిగిరాదు కాని, అతడు నిర్మంచబడిన నేలమంటి, అతని కాళ్ళ క్రింద ఉన్న మంటి నుండే అతనికి ఆహారం సిద్ధపరచబడింది.

అతను విత్తనం నేలలో పెట్టాలి. అతని ఆహారమైన విత్తనమును నేలలో పెట్టాలి. ఆ పని అతను చేస్తే, ఒక్క విత్తనం విస్తారముగా విస్తరించి, అనేకమైన విత్తనములుగా మారి అతనికి ఆహారమును, మరలా అతను నేలలో విత్తుటకు విత్తనాన్ని ఇస్తుంది.

చెట్టుకి పండ్లు ఉన్నవి కాబట్టి కడుపార తిని, కంటినిండ నిద్రపోతే శరీరం ఒప్పుకోదు. భూమి మీద నివశించే మానవులు ఎక్కువ డబ్బు వైద్యనికి ఖర్చుచేసేవారు. తమ శరీరానికి సరిపోయే పని కల్పించనివారు.

నేలలో విత్తనము మొలుస్తుంది అనే నమ్మకము కలిగి ఉండి, నేలలో పూడ్చి పెడుతున్నాడు. తన అవసరాలు తీర్చాటానికి కావలసినంత డబ్బు మీద మనిషి దృష్టి ఉంచటంలేదు కాని, తను ఎంత దాచగలడో, భూమి మీద ధనవంతునిగా కనపడాలని తన శరీరానికి అనారోగ్యము తెచ్చేటంత డబ్బు సంపాదించుకోవాలని – ఆ అనారోగ్యము ఇతరులకు కనబడకుండా దాచుకోవటానికి ఇంకా కొంత సంపాదించాడు. ఎక్కడ ఎంత దొరికితే అదంతా కూర్చు కోవటానికి అనారోగ్యము అంతకంత గుండెకు హానికరమైన ఆందోళనను ఎక్కువ మోతాదులో కూర్చుకొంటున్నాము. జీవిత పరిమాణము తగ్గించుకుంటున్నాము.

రేపటి దిన ఆహారము అవసరాలు తీరాలంటే "నేడు నీ ఆహారమును నీళ్ళమీద వేయుము. చాలా దినము లైన తరువాత అది నీకు కనబడును" అంటే నేలను దున్ని, నీరు పెట్టి, విత్తనము (మన ఆహారము) విసరితే అది కుళ్ళి వేరుతన్ని మొలచి నూరంతలుగా నీ దగ్గరకు వస్తుంది అని ప్రసంగి పదకొండవ అధ్యాయములో మొదటి వచనములో వ్రాసి, "మరలా ఏడుగురికి ఎనమండుగురికి భాగము పంచి పెట్టుకో. అలా పంచిపెట్టిన నీ సొమ్ము ఎలా ఫలించి నీదగ్గరకు వస్తుందో నీ వెరుగవు. సమస్తము జరిగించు దేవుని క్రియలు నీవెరుగవు" అంటున్నాడు జ్ఞానియైన సొలోమోను.

నీవు దేవుని నమ్మినట్లు సూచన ఏది? నీవు విత్తనము నేలలో విత్తినట్లు నీ సొమ్ము దేవుని యందు విశ్వాసముతో పంచిపెట్టు.

సామెతలు 11:16లో వెదజల్లి అభివృద్ధి పొందువారు కలరు. తగినదాని కన్నా తక్కువ ఇచ్చి, లేమికి వచ్చేవారు కలరు. దేవుని వాక్యము అబద్ధము చెప్పదు. అతిశయోక్తిగా చెప్పదు. అది మనలను సమృద్ధిలోనికి నడిపించే సూత్రాలను తెలియ చేస్తుంది. విశ్వాసము లేకుండా ఎవరు దేవునికి ఇష్టులుగా ఉండలేరు.

మనుష్యులు వట్టి నీడవంటివారై తిరుగు లాడుదురు. వారు తొందరపడుట గాలికే గదా! వారు ధనము కూర్చుకొందురు గాని అది ఎవరికి చిక్కునో వారికి తెలియదు.

# దివ్య బ్రాహ్మణుడు - ప్రభువైన యేసుక్రీస్తు! 1

**గుండాబత్తిని**

భారతదేశములో కులవ్యవస్థ ఉంది. అందలి అగ్రకులాలలో అత్యంత అగ్రకులము, బ్రాహ్మణ కులము. ఆ బ్రాహ్మణ కులముతో సంబంధములేని మరొక దివ్య బ్రాహ్మణ వంశమును గూర్చి వేదాలలో వ్రాయబడియున్నది.

108 ఉపనిషత్తులలో ఒకటైన వజ్ర సూచికో పనిషత్తులో ఈ విషయం ప్రవచించబడినది. బ్రాహ్మణుడంటే ఎవరని వేదం ప్రశ్నిస్తుంది.

**కోవా బ్రాహ్మణోనామ? కిం జీవః కిం దేహః?**
**కిం జాతిః కిం జ్ఞానా? కిం కర్మ?**
**కిం ధార్మికః? ఇతి**

బ్రాహ్మణుడనగా నెవరు? అతడు జీవుడా? దేహమా? వర్ణమా? జ్ఞానమా? కర్మమా? ధర్మము నాచరించువాడా? **వజ్రసూచికోపనిషత్ - 3**

ప్రస్తుతం ఇండియాలో నడుస్తున్న బ్రాహ్మణ కులము యొక్క స్వచ్ఛతను వేదం ప్రశ్నిస్తుంది. వేదము ఏమంటుందో చూద్దాం.

'వర్ణమే బ్రాహ్మణుడని చెప్పుటకూడ పొనగదు. ఒకే వర్ణములోగూడ విభిన్న వర్ణములుండుట వలననూ, పెక్కురు మహర్షులు - ఋష్యశృంగుడు జింకవలనను, కౌశికుడు దర్భలనుండి, జాంబూకుడు జంబుకము వలనను, వాల్మీకి పుట్టనుండి, వ్యాసుడు మత్స్యగంధి వలనను, గౌతముడు కుందేటి వీపునుండి, వశిష్ఠుడు ఊర్వసి వలనను, అగస్త్యుడు కుంభము నుండి జన్మించినట్లు తెలియుట వలనను, వీరందరిలో జాతి ప్రసక్తి లేకయే జ్ఞానులై నందునను, అనేకులు మాహర్షులై యుండుట వలనను, వర్ణమే బ్రాహ్మణుడని చెప్పుట సరిపోదు.'

**వజ్రసూచికోపనిషత్తు - 6వ శ్లోకం**

ఒక శరీరమును చూపించి, ఇతడు బ్రాహ్మణుడు అని చెప్పుటకు వీలుకాదని ఈ ఉపనిషత్తు వాదిస్తుంది:-

ఈ శరీరమే బ్రాహ్మణుడని చెప్పుటకు సరిపోదు. శరీరము పంచభూత నిర్మితమైనందునను, చండాలాది పర్యంతము మానవులందరు ఒకే రూపము కలిగియుండుట వలనను, వార్ధక్యము, మరణము, కర్మాకర్మములు అందరికి సమానముగా ఉన్నందువలనను, బ్రహ్మణుడు తెల్లగానుండ వలెనని, క్షత్రియుడు ఎర్రగా ఉండవలెనని, వైశ్యుడు పచ్చగా నుండవలెనని, శూద్రుడు నల్లగా నుండవలెనని నియమ మేమియు లేనందు వలనను, పిత్రాదులను దహనం చేయు నప్పుడు పుత్రాదులకు బ్రహ్మ హత్యాది దోషములు కూడ సంభవించుచున్నందువలనను, ఈ శరీరమును బ్రహ్మణుడని చెప్పకూడదు.

**వజ్రసూచికోపనిషత్తు - 4,5 శ్లోకాలు**

భారత దేశములో నడుస్తున్న బ్రాహ్మణ కులము యొక్క స్వచ్ఛతను ప్రశ్నిస్తూ, మరొక దివ్య బ్రాహ్మణుని గూర్చి ఈ ఉపనిషత్ ప్రవచించినది. ఏమంటుందో చూద్దాం:

(శ్లోకం పెద్దదైన మూలాన సంస్కృతం ఇవ్వకుండగ - తెలుగు మాత్రమే ఇస్తున్నాను.)

ఎవడైనను - అద్వితీయుడును, జాతిగుణ క్రియా రహితుడును, షడూర్ములును, షడ్భావ వికారాది దోషములు లేనివాడును, సత్యజ్ఞానానందానంత స్వరూపుడును, నిర్వికల్ప సంకల్పుడును, సకల సంకల్పములకు ఆధారుడును, సమస్త భూతాలకు అంతర్యామియు, ఆకాశము రీతిగా, బాహ్యాభ్యంత రములలో వ్యాపించియున్నవాడును, అవిచ్ఛిన్నమైన ఆనందముగలవాడును, అప్రమేయుడును, స్వానుభవముతో గ్రహింపదగినవాడును, స్వయం ప్రకాశుడగు భగవంతుని కరతలామలకము వలె ప్రత్యక్షము చేసికొని కృతార్ధుడైన వాడును, దోష రహితుడును, శాంత్యాది సద్గుణములు గలవాడును, మోహమత్సర్యాది దోషరహితుడును, దంభాహంకారములను లోపలకు చేరనీయనివాడును - ఇట్టి సద్గుణములు గలవాడే బ్రాహ్మణుడని శృతి, స్మృతి, పురాణ, ఇతిహాసముల యొక్క అభిప్రాయమైయున్నది. పై లక్షణములు లేనిచో బ్రహ్మణ సిద్ధియే లేదు.

**వజ్రసూచికోపనిషత్ - 10,11**

వజ్ర సూచికోపనిషత్తులో ఇవ్వబడిన 16 లక్షణాలను ఒక వరస క్రమములో చూద్దాము.

1. అద్వితీయుడు.
2. జాతి గుణ క్రియారహితుడు.
3. షడూర్ములును, షడ్భావ వికారాది దోషములు లేనివాడు.
4. సత్య, జ్ఞాన, ఆనంద, అనంత స్వరూపుడు.
5. నిర్వికల్ప సంకల్పుడు.
6. సకల సంకల్పములకు ఆధారుడు.
7. సమస్త భూతములకు అంతర్యామి.
8. ఆకాశము రీతిగా బాహ్యాభ్యంతరములలో వ్యాపించి యున్నవాడు.
9. అవిచ్ఛిన్నమైన ఆనందము గలవాడు.
10. అప్రమేయుడు.
11. స్వానుభవముతో గ్రహింపదగినవాడు.
12. స్వయం ప్రకాశుడగు భగవంతుని కరతలామలకము వలె ప్రత్యక్షము చేసుకొని కృతార్థుడైనవాడు.
13. దోషరహితుడు.
14. శాంత్యాది సద్గుణములు గలవాడు.
15. మోహమత్సర్యాది దోష రహితుడు.
16. డంభము, అహంకారములను లోపలకు చేరనీయని వాడు.

ఈ లక్షణాలు లేనివాడు బ్రాహ్మణుడు కాదని వజ్ర సూచికోపనిషత్తు ఖరాఖండిగా తెలియజేస్తుంది. ఈ బ్రాహ్మణుడు ఎవరు? ఏ కాలములో పుట్టారు? అని మనము వెదకులాట ప్రారంభిస్తే, ఈ 16 యోగ్యతలు గలవాడు – ప్రభువైన యేసుక్రీస్తు అని నాకు అర్థమైనది. ఈ అర్హతలు మామూలు మానవులకు ఉండవు. ఈ 16 యోగ్యతలు యేసుప్రభువునకు ఎలా వర్తిస్తాయో పరిశీలన చేద్దాము.

**అద్వితీయుడు:**

అద్వితీయుడనగా – అతని వంటివాడు మరొకడు లేడని అర్థము. యేసుప్రభువు ఒక్కరే దేవుని సృష్టి అంతటిలో అద్వితీయుడు. పరలోకములోను, భూలోకములోను యేసు ప్రభువు ఒక్కరే అద్వితీయుడు.

పరలోకములో యేసుప్రభువు యొక్క అద్వితీయుత:

**యేసుప్రభువు ఆదిసంభూతుడు:**

దేవుడు తన సృష్టిలోనిదేదియు, ఆకాశములలో గాని చేయకముందు, ఆయన ఒక్కరే ఉన్నారు. ఆయన ఒంటరిగా ఎంతకాలమున్నారో మనకు తెలియదుగాని, దేవుడు ఒంటరిగానున్న కాలములో, ఒకానొక సమయంలో, సృష్టిలోని దేదియు చేయబడక పూర్వం, తన వాక్కు ద్వారా ఓ దివ్యాంశ సంభూతుని కలుగచేశారు. ఆ క్రొత్త వ్యక్తిని దేవుడు – తనకు, కుమారునిగా చేసుకున్నారు. ఆయనే ప్రభువైన యేసుక్రీస్తు.

**యేసుప్రభువు తన గురించి తాను స్వయంగా చెప్పిన మాటలు:**

తండ్రీ! లోకము పుట్టకమునుపు నీయొద్ద నాకు ఏ మహిమ యుండెనో, ఆ మహిమతో నన్ను ఇప్పుడు నీయొద్ద మహిమ పరచుము. **యోహాను 17:5.**

తండ్రీ! నేను ఎక్కడ ఉందునో, అక్కడ నీవు నాకు అనుగ్రహించిన వారును నాతో కూడ ఉండవలెననియు, నీవు నాకనుగ్రహించిన నా మహిమను వారు చూడవలెననియు కోరుచున్నాను. జగత్తు పునాది వేయబడకమునుపే నీవు నన్ను ప్రేమించితివి. **యోహాను 17:24.**

అందుకు యూదులు నీ కింకను ఏబది సంవత్సరాలైనను లేవే! నీవు అబ్రాహామును చూచితివా? అని ఆయనతో చెప్పగా, యేసు అబ్రాహాము పుట్టకమునుపే నేను ఉన్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను అనెను. **యోహాను 8:57,58.**

**స్ముర్ణలో ఉన్న సంఘపు దూతకు ఈలాగు వ్రాయుము:**

మొదటివాడును కడపటివాడునై యుండి, మృతుడై మరల బ్రతికిన వాడు చెప్పుసంగతులేవనగా **ప్రకటన 2:8.**

లవొదికయలో ఉన్న సంఘపు దూతకు ఇలాగు వ్రాయుము:

ఆమేన్ అనువాడును, నమ్మకమైన సత్య సాక్షియు, దేవుని సృష్టికి ఆదియునైనవాడు చెప్పుసంగతులేవనగా

**ప్రకటన 3:14.**

(సశేషం)

సీరియల్

# ప్రజాపతి బలియాగం

16

రెవ. జె. లాజరస్ , జమ్మలమడుగు

మరియు మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తీస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మని వానికి శిక్ష విధింపబడును. నమ్మిన వారివలన ఈ సూచన క్రియలు కనబడును. ఏవనగా నా నామమున దెయ్యములను వెళ్ళగొట్టుదురు. క్రొత్త భాషలు మాట్లాడుదురు. పాములను ఎత్తిపట్టుకొందురు. మరణ కరమైనదేది త్రాగినను అది వారికి హాని చేయదు. రోగుల మీద చేతులుంచినప్పుడు వారు స్వస్థత నొందుదురని వారితో చెప్పెను. ఇలాగున ప్రభువైన యేసు వారితో మాటలాడిన తరువాత పరలోకమునకు చేర్చుకొనబడి దేవుని కుడి పార్శ్వమున ఆశీనుడయ్యెను. ప్రభువు వారికి సహకారుడై యుండి వెనువెంట జరుగుచున్న సూచక క్రియలవల్ల వాక్యమును స్థిరపరుచుచుండెను. ఆమేన్..! **మార్కు 16:14-20.**

**తన శిష్యుల మీదికి పరిశుద్ధాత్మను పంపుట :-**

నేను తండ్రిని వేడుకొందును మీ యొద్ద ఎల్లప్పుడు ఉండుటకు వేరొక ఆదరణ కర్తను (ఉత్తర వాదిని) అనగా సత్య స్వరూపియగు ఆత్మను మీకనుగ్రహింతును. లోకము ఆయనను చూడదు. ఆయనను ఎరుగదు, కనుక ఆయనను పొందనేరదు. మీరు ఆయనను ఎరుగుదురు. ఆయన మీతో కూడ నివశించును. మీలో ఉండును. మిమ్మును అనాథలుగా విడువను. మీ యొద్దకు వత్తును. కొంతకాలమైన తరువాత లోకము నన్ను మరెన్నడును చూడదు. అయితే మీరు నన్ను చూతురు. నేను జీవించుచున్నాను. కనుక మీరును జీవింతురు. ఆదరణకర్త అనగా, తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి, నేను మీతో చెప్పిన సంగతులన్నింటిని మీకు జ్ఞాపకము చేయును. తండ్రి యొద్ద నుండి మీ యొద్దకు నేను పంపబోవు ఆదరణ కర్త అనగా తండ్రి యొద్ద నుండి బయలుదేరు సత్య స్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును. మీరు మొదటి నుండి నాయొద్దనున్నారు. కనుక మీరు సాక్ష్యమిత్తురు. నేను మీతో సత్యము చెప్పుచున్నాను. నేను వెళ్ళిపోవుట మీకు ప్రయోజనకరము. నేను వెళ్ళని యెడల ఆదరణకర్త మీ యొద్దకు రాడు. నేను వెళ్ళి ఆయనను మీయొద్దకు పంపుదును. ఆయన వచ్చి పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు లోకమును ఒప్పుకొనచేయును. సత్యస్వరూపి అయిన ఆత్మ వచ్చినప్పుడు మీరు సత్యమంతయు గ్రహించు నట్లు ఆయన మిమ్మును నడిపించును. ఆయన తనంతట తానే ఏమియూ బోధింపక వేటిని వినునో వాటినే బోధించి, సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును. ఆయన నా వాటిలోనివి తీసుకొని మీకు తెలియజేయును. నన్ను మహిమ పరచును. తండ్రికి కలిగిన వన్నియు నావి. అందుచేత ఆయన నావాటిలోనివి తీసుకొని మీకు తెలియ జేయును.

మనకైతే దేవుడు వాటిని, తన ఆత్మ వలన బయలు పరచియున్నాడు. ఆ ఆత్మ అన్నిటిని, దేవుని మర్మములను కూడా పరిశోధించుచున్నాడు. **1కోరి 2:10.** అన్యాయము చేయువాడు ఇంకను అన్యాయమే చేయును. అపవిత్రుడైన వాడు ఇంకను అపవిత్రుడు గానే ఉండును. నీతిమంతుడు ఇంకను నీతిమంతుడుగానే ఉండును. పరిశుద్ధుడింకను పరిశుద్ధుడుగానే ఉండును. ఇదిగో త్వరగా వచ్చుచున్నాను. వాని వాని క్రియలను బట్టి ప్రతివానికిచ్చుటకు నేను సిద్ధపరచిన జీవితము నాయొద్ద నున్నది. నేను అల్ఫాయు, ఓమేగయు, మొదటివాడును, కడపటి వాడును, ఆదియు, అంతమునై యున్నాను. **ప్రకటన 22:11-13.**

**యేసు ప్రభువు రెండవ రాకడకు సూచనలు:-**

ప్రభువు తన శిష్యులకు ఇలా చెప్పుచున్నాడు. ఎవడును మిమ్మును మోసపరచకుండా చూచుకొనుడి. అనేకులు నా పేరట వచ్చి నేను క్రీస్తునని చెప్పి పలువురుని

మోసపరెచదరు. మరియు మీరు యుద్ధములను గూర్చియు, యుద్ధ సమాచారములను గూర్చియు వినబోదురు. కలవర పడకుండా చూచుకొనుడి. ఇవి జరుగవలసి యున్నవి కాని అంతయు వెంటనే రాదు. జనము మీదికి జనమును, రాజ్యము మీదికి రాజ్యము లేచును. అక్కడక్కడ కరువులను, భూకంపములు జరుగును. ఇవన్నియు వేధనలకు ప్రారంభము. అప్పుడు జనులు మిమ్మును శ్రమలపాలు చేసి చంపెదరు. మీరు నా నామము నిమిత్తము సకల జనులచేత ద్వేషింపబడుదురు. అనేకులు అభ్యంతరపడి యొకనినొకడు అప్పగించి యొకనినొకడు ద్వేషింతురు. అనేకులైన అబద్ధపు ప్రవక్తలు వచ్చి, పలువురిని మోస పరచెదరు. అక్రమము విస్తరించుటచేత అనేకుల ప్రేమ చల్లారును. (అవినీతి పెరిగిపోవుట వలన) అంతము వరకు సహించిన వాడే రక్షింపబడును. మరియు ఈ రాజ్య సువార్త సకల జనులకు సాక్షార్థమై లోకమంతట ప్రకటింపబడును. అటు తరువాత అంతయు వచ్చును. అబద్ధపు క్రీస్తులు, అబద్ధపు ప్రవక్తలు వచ్చి (బాబాలు) సాధ్యమైతే ఏర్పర్చబడిన వారిని సహితము మోసపరుచుటకై గొప్ప సూచక క్రియలను, మహత్కార్యములను కనపరచెదరు. ఇదిగో ముందుగా మీతో చెప్పియున్నాను. మెరుపు తూర్పున పుట్టి పడమటి వరకు ఎలాగు కనబడునో అలాగే మనుష్య కుమారుని రాకడ ఉండును. సహోదరుడు, సహోదరుని తండ్రి కుమారుని మరణమున కప్పగింతురు. కుమారులు తల్లిదండ్రుల మీద లేచి వారిని చంపింతురు. నా నామము నిమిత్తము అందరి చేత మీరు ద్వేషించబడుదురు. అంతము వరకు సహించిన వాడే రక్షణ (మోక్షము) పొందును. **మార్కు 13:12.** అంత్య దినములలో అపహాసకులు అపహసించుచు వచ్చి తమ స్వకీయదురాశల చొప్పున నడచుకొనుచు ఆయన రాకడను గూర్చిన వాగ్దానమేమాయెను? పితరులు నిద్రించునది మొదలుకొని సమస్తమును సృష్టి ఆరంభమున ఉన్నట్లే నిలిచియున్నదే అని చెప్పుదురని మొదట మీరు తెలిసుకొన వలయును. ఏలయనగా పూర్వమునుండి ఆకాశముండె ననియు, నీళ్ళలో నుండియు, నీళ్ళవలనను కూర్చబడిన భూమియు, దేవుని వాక్యము వలన కలిగెననియు వారు బుద్ధి పూర్వకముగా మరుతురు. ఆ నీళ్ళవలన అప్పుడున్న లోకము నీటి వరదలో మునిగి నశించెను. అయితే ఇప్పుడున్న **ఆకాశమును, భూమియు భక్తిహీనుల తీర్పును, నాశనమును జరుగు దినము వరకు అగ్నికొరకు నిలువ చేయబడినదై, అదే వాక్యము వలన భద్రము చేయబడి ఉన్నది.**

అయితే ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును. పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమై పోవును. కనుక ఆకాశములు రగులుకొని లయమై పోయినట్టుయు, పంచభూతములు మహావేండ్రముతో కరిగిపోవునట్టియు, దేవుని దినపు రాకడ కొరకు కనిపెట్టుచు దానిని ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తన తోను, నను భక్తితోను, ఎంతో జాగ్రత్తగలవారై ఉండవలెను. అయినను మనము ఆయన వాగ్దానమును బట్టి క్రొత్త ఆకాశముల కొరకు కనిపెట్టుచున్నాము. వాటియందు నీతి నివశించును. **11పేతురు 3:3,7,10,13.** ఆదినముల శ్రమ ముగిసిన వెంటనే చీకటి సూర్యుని కమ్మును, చంద్రుడు కాంతి నియ్యడు, ఆకాశము నుండి నక్షత్రములు రాలును. ఆకాశమందలి శక్తులు కదిలింపబడును. అప్పుడు మనుష్య కుమారు(యేసు)ని సూచన ఆకాశమందు కనబడును. అప్పుడు మనుష్య కుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను ఆకాశ మేఘారూఢుడై వచ్చుట చూచి, భూమి మీదనున్న భూరతో తన దూతలను పంపును. వారు ఆకాశము యొక్క ఈ చివర నుండి ఆ చివర వరకు నలుదిక్కుల నుండి ఆయన ఏర్పరచుకొనిన వారిని పోగు చేతురు. ఇవన్నియు జరుగు వరకు ఈతరము గతింపదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. ఆకాశమును, భూమియు గతించును గాని నామాటలు ఏమాత్రమును గతింపవు. **మత్తయి 24:1,4,24,29,31,35.**

**(సశేషం)**

# సునాద సంవత్సరము

ఇశ్రాయేలీయుల మీద సదాకాలము రాజుగా స్థిరపరచుటకు యెహోవా తలచి యుండెను. అయితే నీ రాజ్యం నిలువదు. యెహోవా తన చిత్తానుసారమైన మనస్సు గల యొకనిని కనుగొని యున్నాడు, అని సమూయేలు ఇశ్రాయేలు మొదటి రాజైన సౌలుతో చెప్పినప్పుడు దేవుని చిత్తానుసారుడైన దావీదు అప్పుడే జన్మించాడు.

భారతదేశములో తెలుగువారి మధ్య సేవ చేయటానికి వచ్చిన యస్.యస్.డే 1808న కెనడాలో జన్మించాడు. ఫిబ్రవరి 5,1836లో విశాఖపట్నంలో ఓడ దిగాడు. 1840లో నెల్లూరు మొదటి క్రైస్తవ సంఘము స్థాపించాడు.

1846లో అమెరికా వెళ్ళి 1848లో లేమెన్ జూవెట్ దంపతులతో ఇండియా వచ్చాడు. అనారోగ్యము వలన 1853లో అమెరికా వెళ్ళి ఇంకా తిరిగి రాలేదు. సెప్టెంబర్ 17-1871న అమెరికాలో ప్రభువునందు నిద్రించాడు.

లేమెన్ జూవెట్ పరిశుద్ధ గ్రంధము తెలుగులోనికి అనువదించాడు.

1853- డిసెంబర్ 31వ రాత్రి ఒంగోలు కొండ మీద జూవెట్ దంపతులు, ఇద్దరు స్థానిక విశ్వాసులు, జూలియా అనే జూవెట్ దొర విద్యార్థిని, రాత్రంతా ప్రార్థించి, 1854-జనవరి1న ఉదయం కొండదిగి వచ్చారు.

శామ్యూల్ డే గారు సెప్టెంబర్ 27-1841లో వెంకటప్పయ్య అనే తెలుగువానికి మొదటి బాప్తీస్మం ఇచ్చారు.

లేమెన్ జూవెట్‌గారు, యం. ఓబులు అనే తెలుగు వ్యక్తికి 1862లో మొదటి బాప్తిస్మం ఇచ్చారు. జూవెట్‌గారు అమెరికా ప్రయాణం కొరకు మద్రాసు ఓడ రేవులో ఓడలో ఉండగా, ఓబులు గారు 180 మైళ్ళు నడచి వచ్చి, జూవెట్ దొరని కలసి, ఒంగోలుకు మరియొక మిషనరీని అమెరికా నుండి తీసుకొని రావలెనని కోరాడు. ఓబులు నడచిన సుదీర్ఘమై నడకకు ప్రతిఫలముగా దేవుడు క్లౌ దొరను తెలుగు వారి కొరకు పంపించాడు.

శామ్యూల్ డే గారు నెల్లూరులో మిషన్ స్థాపించిన రోజుననే అమెరికాలో క్లౌ దొర జన్మించారు. అమెరికాలోని బాప్టిస్టు మిషన్‌వారు నెల్లూరులోని సంఘసేవను మాన్పివేయ వలెనని యోచించుచుండగా జూవెట్ దొరతో కలసి క్లౌ దంపతులు ఏప్రిల్ 22-1865న నెల్లూరుకు చేరారు.

క్లౌ దొర ఒంగోలులో నలభై సంవత్సరాలు సేవ చేశారు.

క్లౌ దొర ఇండియాలో అడుగు పెట్టిన ఎనిమిది నెలలకు ఒంగోలులో 35 సంవత్సరాలు సేవ చేస్తూ, జూవెట్ మెమోరియల్ చర్చిని, క్లౌ మెమోరియల్ హాస్పిటల్‌ను కట్టించిన బేకరు దొర అమెరికాలో జన్మించారు.

నా చిత్తనుసారుడు జన్మించక ముందే దేవుడు అతని ఎరిగి యుండి సమూయేలు ద్వారా సౌలురాజుకు 1సమూయేలు 13:14 లో చెప్పించాడు.

మన జీవితాలు కూడా ఈ లోకంలోకి రాకముందే దేవుని చేత ఏర్పర్చబడినవి. చివరికి మన జీవితములో కాని, సంఘములో కాని, జరిగినవి, జరుగుచున్నవి, జరగబోయే సంఘటనలకు కూడ దేవుడు తారీఖులు నిర్ణయించియున్నాడు.

ఉదా: తెలుగువారి మధ్య క్రీస్తుసేవ ప్రారంభమైన 50 సం॥లకు నెల్లూరులో సునాద సంవత్సరము (జూబిలి) 1885లో నాటి మిషనరీయులు నిర్ణయించారు. బాప్టిస్టు మిషనరీ స్థాపకుడైన శామ్యూలు డే చనిపోయి అప్పటికి 14సం॥రాలు గతించాయి. ఆయన 1835లో అమెరికాలో బయలుదేరి విశాఖపట్నం వచ్చి, 1840లో నెల్లూరులో సంఘస్థాపన చేశాడు. నెల్లూరు, తెలుగువారి తల్లి సంఘ మైనది.

డౌని దొర నాయకత్వములో 20 తెలుగు పట్టణాల నుండి 31 మంది విదేశ మిషనరీలు నెల్లూరు లోన్ స్టార్ చర్చిలో కూడుకొనవలసి యున్నది.

ఫిబ్రవరి 5న ఈ సునాద సంవత్సర కూడిక ప్రారంభించారు. కాని ఆ ఫిబ్రవరి 5న శామ్యూల్ డే విశాఖ పట్టణంలో సముద్రము మీద ఓడలో నుండి తెలుగు గడ్డ

**తరువాయి భాగం 15వ పేజీలో**

సాక్ష్యము

# బస్సులో నుండి దింపిన దేవుడు



**సువార్త కేరి, కావలి**

నేను చలంచర్లలో జాబు చేసే రోజుల్లో ఒకసారి దశరా సెలవుల్లో కావలికి వెళ్ళడానికి రెండు బ్యాగ్‌ల్లో గుడ్డలుపెట్టుకొని, కుమారి అనే అయిదవ క్లాసు అమ్మాయిని తోడు తీసుకొని, బస్‌స్టాపు (ఒక పెద్ద చింతచెట్టు) దగ్గరకు వచ్చి నిలబడ్డాము. తీరా బస్సు వచ్చాక చూస్తే, నిండిపోయి ఉంది. ఎలాగో సర్దుకొని నిలబడే వెళ్లామనుకొని ఎక్కి వాకిట్లోనే నిలబడ్డాను. ఒక పెద్ద మనిషి అయ్యవారమ్మకు సీటు ఇవ్వమని అడుగుతున్నాడు. ఈ లోపల నాకు 'దిగు, దిగు, దిగు' అని ఎవరో చెప్తున్నట్లు అనిపించింది. ఆ మాటలకు లోబడి బస్సును ఆపించి దిగిపోయాను. బస్సులో నాకు తెలిసినవాళ్ళు "అయ్యవారమ్మ దిగావేమి? ఎవరో ఒకరు సీటు ఇస్తారు కూర్చోవచ్చు" అని అంటున్నారు. కాని నాకు మాత్రం ఆ జనంలో మరలా బస్సు ఎక్కాలని అనిపించలేదు. కొద్దిసేపు నాకొరకు ఆగిన బస్సు, నేను ఎంతకి ఎక్కకపోయేసరికి వెళ్ళిపోయింది. మరలా సాయంత్రం బస్సులో వెళ్ళొచ్చని ఇంటికి వెళ్ళిపోయాను. అన్నం వండుకొని, టమాటా బజ్జీ చేసుకొని, గుడ్డు ఆమ్లెట్ వేసుకొని, తిని పండుకోని ఆలోచించాను. 'ప్రార్థన చేసుకునే బయలుదేరాను కదా! మరి ఇలా ఎందుకు జరిగింది? నా ప్రార్థన దేవుని సన్నిధికి చేరివుండదు' అనుకున్నాను.

మరలా సిద్ధపడి, 4 గంటల బస్సుకి వచ్చి, సీటులో కూర్చున్నాను. చాలా ఖాళీగా ఉంది. కండక్టర్ వస్తుంటే టికెట్ తీసుకుందామని పర్సు తీస్తున్నాను. కండక్టర్ నా దగ్గరకు వచ్చి, అతని చెయ్యి నా ముఖానికి ఎదురుగా పెట్టి 'దేవుడు దింపినట్లు దిగావుగదమ్మా!' అని అన్నాడు. 'ఏమయ్యింది భాషా?' అని అడిగాను. "సిరిపురం వెళ్ళగానే బస్సుకి రెండు టైర్లు పగిలిపోయి, అందరూ కావలి నడచి వెళ్ళారు" అని నవ్వుతూ చెప్పాడు.

నా బిడ్డ రెండు బ్యాగ్‌లు మోసుకుంటూ కావలి దాకా నడవలేదని తెలిసిన నా యేసయ్య నన్ను బస్సులో నుండి దించి వేశాదని నమ్మి, నేను కూర్చున్న చోటనే దేవునికి కోటానుకోట్ల స్తోత్రాలు, స్తుతులు చెల్లించాను.

మన దేవుడు నిన్న, నేడు, నిరంతరం ఏకరీతిగా నుండు దేవుడు. తనను నమ్మిన బిడ్డలను విడిచిపెట్టే దేవుడు కాదు. ఆయన ఇమ్మానుయేలుగా ఎల్లప్పుడూ మనతో ఉంటాడు. ఆమేన్..!



## ఎస్.యం.ఎస్. (వాయిస్/టెక్ట్స్) పరిచర్య



**ఎవరైనా ప్రతిరోజు దేవుని వాక్యము (టెక్ట్స్) ఉచితంగా పొందగోరినచో లేదా మీ ప్రియులకు పంప గోరినచో**

**99 0 88 22 365** Days

**నెంబరును సంప్రదించగలరు.**

ప్రతిరోజు 'హన్నాకృప' పాఠకులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు దేవుని వాక్యము SMS చేయుటకు సహకారము అందించుచున్న వారందరికి వందనములు. ఈ పరిచర్య ద్వారా ఎంతోమంది ఆత్మీయ మేలులు పొందుచున్నందుకు దేవునికి స్తోత్రములు చెల్లించుచున్నాము.

# జ్ఞాపకాలు

రాజేశ్వరి అనే 16 సంవత్సరాల అమ్మాయికి వివాహమైన వెంటనే అత్తగారింటికి వెళ్ళింది. అత్తవారింటి ప్రక్కింటిలో మామిడి చెట్టుకి కాయ కోయబోయి పడిపోయి నందున వెన్నుపూస విరిగినది. వైద్యం కొరకు వివిధ పట్టణాలలో అనేక ఆపరేషన్‌లు జరిగినా, ఫలితం లేక పోయింది. నడుం క్రింది భాగము స్పర్శ లేదు. యేసయ్య బాగుచేస్తాడని ఎవరో చెబితే, కుటుంబము అంతా తల్లి, తండ్రి, భర్త మిగిలిన వారందరు యేసుప్రభువును నమ్ము కున్నారు. ఓ సంవత్సరం చూసి స్పర్శ రాలేదని యేసయ్యని వదిలివేశారు. రాజేశ్వరి, ఆమె తండ్రి కొండారెడ్డి మాత్రం రక్షణాను భవనంలోకి వచ్చి, ఆయనను వదలక మంచి విశ్వాసులైయ్యారు.

నేను నెలకు ఒక్కసారి ఆమెను దర్శించి, ప్రార్థించి నా రచనలతోపాటు 'హన్నాకృప' పత్రికను ఇస్తూ ఉండే వాడిని.

2004వ సంవత్సరంలో ఒంగోలులో ఒక వ్యక్తి ఆకాశంలో ప్రయాణం చేసి వచ్చి, యేసయ్యను గురించి చెబితే దాని విని ఆయనతో ప్రార్థన చేయించుకోవాలని, మంచంమీద మోయించుకొని, ఆ కూటములకు హాజరైతే, ఆ సువార్తికుని దర్శనము కూడా మూడు రోజుల్లో దొరకలేదు.

నేను ఓ రోజు ఆమె వద్దకు వెళ్తే, దేవుని సేవ కులమని చెప్పి, రక్షణ కొరకు, స్వస్థత కొరకు ఆహ్వానంతో, గంపెడు ఆశతో వేళ్తే, నిరాశ – అన్యజనముల వద్ద అవమానం జరిగిందని ఏడ్చింది.

టి.వి.లో ప్రతి సోమవారం ఉదయం గుంటూరు శాంతవర్ధన్ గారి వాక్యము వినేవాడిని. స్వస్థతల విషయం ఆయన చెప్పేవన్నీ వినేవాడిని. ఇప్పుడు ఈ అమ్మాయికి జరిగిన సంఘటనలతో మనస్థాపించెంది, శాంతవర్ధన్ గారికి ఫోనుచేసి "అయ్యా! స్వస్థతల విషయం మీతో మాట్లాడాలి. నాకు సమయము ఇస్తారా?" అని అడిగాను." రేపు ఉదయం 10 గంటలకు రండి" అన్నారు. ఉదయం 9గంటలకు గుంటూరులో రైలు దిగి ఫోనుచేసి "అయ్యా! మీ ఇల్లు ఎక్కడ?" అని అడిగాను. "నేను 10 గంటలకు మిమ్మల్ని రమ్మన్నాను, ఇప్పుడు వచ్చరే?" అన్నారు. ఈయనకు కోపం ఎక్కువేమో అనుకొని, నిరాశచెంది, ఇంటి అడ్రసు అడిగాను. 10 గంటలకు వారి ఇంటికి వెళ్తే, ఆయన "పదినిమిషాలు మీకు సమయము, అవతల నాకు పనుంది" అన్నారు. నేను మాట్లాడుతూ అనేక దైవిక స్వస్థత విషయాలు, నా సందేహాలు అన్ని అడిగాను. దాదాపు 90 నిమిషాలు మాట్లాడుకున్నాము. నాకు తృప్తి కలిగింది. ప్రార్థన చేసి వస్తుంటే, ఆయన స్వయముగా చల్లని జ్యూస్ ఇచ్చి, ఒక కవరు ఇచ్చారు.

నేను బయటకు వచ్చి రూపాయి కాయిన్ బాక్సుల్లో రూపాయ వేసి, నా కుమారుని ఫోను చేసి, "నేను పొన్నూరు వెళ్ళి మనకు రావలసిన డబ్బులు తీసుకొని వస్తాను" అని చెప్పాను. నా కుమారుడు బదులిస్తూ, పొన్నూరు వారు వచ్చి ఇప్పుడే డబ్బులు చెల్లించారు. మనకు ఇంకా 1000 రూపాయలైతే హన్నాకృపకు పేపరు కొనవచ్చు అన్నాడు.

అప్పుడు శాంతవర్ధన్‌గారు ఇచ్చిన కవరు తెరచి చూస్తే, దానిలో 1000రూ. ఉన్నవి. ఒంగోలు వెళ్ళి పదిరోజుల తర్వాత వెయ్యిరూపాయిలు చందా ఇచ్చిన శాంతవర్ధన్ గారికి కృతజ్ఞతలు తెలుపలేదేమని ఆఫీసు నుండి బయటకు వచ్చి, శాంతవర్ధన్ గారికి ఫోను చేశాను. అమ్మగారు తీసుకున్నారు. ''అమ్మ! అయ్యాగారితో మాట్లాడాలి" అన్నాను. అమ్మగారు "అయ్యగారు అమెరికాలో ఉన్నారు" అని చెప్పారు. నా ఆఫీసుకు వచ్చి మళ్ళీ కాయిన్ బాక్సు వద్దకు వెళ్ళి "అమ్మ నేను హన్నాకృప, ఒంగోలు నుండి మాట్లాడుతున్నాను" అని చెప్పాను. "నాకు తెలుసు" అన్నారు. "అమ్మా! నేను మీకెలా తెలుసు?" అని అడిగాను. "ఇప్పుడే మీకు అయిదు వందలు మనియార్డరు చేసాను" అన్నారు.

ఆమె ఎవరు అనుకోని మాట్లాడుతున్నారో అనుకొని, "అమ్మా! నేను హన్నాకృప పత్రిక సామ్యేల్ రాజేంద్రను" అని అన్నాను. "అదేనండి, మీకు 500 వందలు మనియార్డరు చెయ్యమని అమెరికా నుండి అయ్యగారు ఫోనులో చెప్పారు" అని బదులిచ్చారు.

"అమ్మా! అయ్యగారు ఇండియా ఎప్పుడు వస్తారు?" అని అడిగాను. "ఈ రోజు మద్రాసులో విమానం దిగారు" అని చెప్పారు. "అయితే ఒంగోలు మీదుగానే గుంటూరు వెళ్ళాలి. ఏ ట్రైన్‌లో వస్తున్నారు?" అని అడిగాను.

"కారులో ఈపాటికి చిలకలూరిపేట దాటి ఉంటారు" అని చెప్పారు. అలా అయితే ఆయన రేపు ఇండియాకి వస్తూ, నాకు అర్జంటుగా 500 మనియార్డరు చెయ్యవలసిన అవసరం ఏముంది? అదీకాక 15 రోజుల క్రితం నాకు వెయ్యిరూపాయలు ఇచ్చారు. అదీకాక వారితో నా పరిచయము ఒక్కసారే! అమ్మగారిని నేను అసలు చూడ లేదు.

తర్వాత చాల నెలలు గడిచిపోయాయి. ప్రతి నెల ఒక్కసారైనా శాంతవర్ధన్‌గారిని కలుసుకొంటున్నాను. చివరికి ఓ రోజు గుర్తుకు వచ్చి, "సార్! మీరు అమెరికానుండి రేపు బయలుదేరబోతూ, నాకు 500 ఇవ్వమని అమ్మగారికి ఫోనులో ఎందుకు చెప్పారు?" అని అడిగాను.

ఆయన జ్ఞాపకమునకు తెచ్చుకొని, "నేను అమెరికాలో నా పెట్టెలో మీ హన్నాకృపను చూసాను. అందులో ఒక ఆర్టికల్ చదివి ఇన్‌స్పైర్ అయి అలా చేసాను" అని చెప్పారు.

ఆ శీర్షిక ఇదే

# దేవుని ప్రేమ ఇదిగో...

నా పేరు తేళ్ళ సింప్సన్. నా భార్య సుధారాణి. కపిలేశ్వరము మండలములో వల్లూరు గ్రామములో గత 15 సం॥రాలుగా ప్రభువు సేవ చేస్తున్నాము.

మా ఊరికి 6 కిలోమీటర్ల దూరంలో "కాలేరు" అనే గ్రామము ఉన్నది. ఆ గ్రామంలో సేవచేసి, రాములవారి దేవాలయం వద్ద కూర్చున్నాము. ఆలయం పూజారి కడు వృద్ధుడు. ఆయన మా యోగక్షేమములు అడిగి, తనకు తెలిసిన విషయం ఇలా చెప్పారు.

"చాలాకాలం క్రితం బహుశా నాకు 10సం॥ వయస్సు. అప్పుడు ఈ గ్రామములో గొల్లపల్లి నతనయేలు గారు యేసు సేవ చేస్తుండేవాడు. పాస్టరును, అగ్రకులస్తులు మా వీధిలో యేసు సంగతులు చెప్పవద్దని ఎన్నిసార్లు హెచ్చరించినా ఆయన వినలేదు. ఒకరోజు తెల్లవారు జామున ఈ విధిలో యేసు సంగతి చెబుతుంటే అగ్రకులస్తుల కుర్రోళ్ళు ఆయనను చింత బెత్తాలతో కొట్టి వీధులలో తిప్పుతుంటే, అప్పటికప్పుడు ఒకపాట కవిత్వం చేసి పాడాడు. దేవుని ప్రేమ ఇదిగో, జనులారా భావంబునం తెలియరే, కేవలము నమ్ముకొనిన పరలోక జీవంబు మన కబ్బును అనే పాట. ఆయన చేతులకు, కాళ్ళకు బంధం వేశారు.

ఈ సంగతి తెలుసుకొనిన గవర్నమెంటు ఇంజీనీరుగా ఉండిన సర్ ఆర్థర్‌కాటన్ అనే దొర – గుఱ్ఱం మీద హుటాహూటిన "కాలేరు" వచ్చేటప్పటికి, ఆయన చేతిలో కొరడాచూసి నతనియేలును హింసిస్తున్న యవ్వనులు పారిపోయారు. వాళ్ళను కోపగించుకొని, నతనియేలు గారి కట్లు విప్పిస్తుంటే, ఆ దొరని చూసి నతనియేలు గారు వారిని క్షమించమని చెప్పి, దేవుని ప్రేమ ఇదిగో అనే పాట 15 వచనములు వ్రాసి ఆ దొరకు ఇచ్చాడు. తను వాళ్ళని కోప్పడినందుకు కాటన్ దొర సిగ్గుపడ్డాడు" అని చెప్పాడు.

దేవుని ప్రేమ ఇదిగో అనే పాట వ్రాయుటకు దేవుడు నతనియేలు గారికి కలుగజేసిన పరిస్థితులను వినినప్పుడు మా హృదయంలో దేవునికి కృతజ్ఞతలు చెల్లించాము.

# సిలువే నా శరణాయెనురా

ఆంధ్ర క్రైస్తవ కీర్తనల పుస్తకములో 13 పాటలు వ్రాసిన చెట్టి భానుమూర్తిగారి స్వగ్రామము విశాఖ జిల్లా

**తరువాయి భాగం 19వ పేజిలో**

# ఫాదర్ హయ్యర్ (1793 - 1873)

**(ఆంధ్రలో సేవ 1842 - 1871)**

అంత గొప్ప సహాయమునకు ప్రోత్సాహమునకు కృతజ్ఞతగా సొసైటీ వారు స్టోక్స్‌గారికి ఆకర్షణీయమైన "ఊగే మహాగని" కుర్చీని, శ్రీమతి స్టోక్స్ గారికి రంగురంగుల అల్లిక సంచిని హయ్యరు ద్వారా బహుకరించిరి. ఇది సొసైటీ వారి ఔదార్యమునకు నిదర్శనం. ఆయనను అభినందించుచు ఒక ఉత్తరము కూడ వ్రాసి పంపించారు. హయ్యరుకు ఫోటోలు ముద్రించు యంత్రమును బహుకరించారు. అది ఆయన పనిలో ఎంతగానో ఉపయోగపడింది. అయితే పెన్సిల్వేనియా మిషనరీ సొసైటీ వారు, విదేశీ మిషనరీ సొసైటీవారు కలసి హయ్యరు గారికి ఒక హెచ్చరిక చేసిరి. ఏమనగా - అనారోగ్య పరిస్థితులలోను, జీతముచాలని పరిస్థితులలోను మినహ, స్వదేశానికి (అమెరికా) రావద్దనిరి. అనగా వారి అనుమతి లేకుండా అమెరికాకు ఎట్టి పరిస్థితులలోను రాకూడదన్నమాట. ఈవిధంగా హయ్యరుపై మరికొన్ని ఆంక్షలు విధించబడినవి. అయినా అతడు నిరుత్సాహపడలేదు.

6. ఇండియాకు రెండవసారి ప్రయాణము : (1848)

అమెరికా ప్రజల సానుభూతిని పొందిన హయ్యరు 1848లో బోస్టను పట్టణము నుండి "మేరీ ఆడమ్స్" అను ఓడ ఎక్కి, ఇండియాకు తిరిగి ప్రయాణమయినాడు. ప్రయాణములో చరిత్ర, ప్రపంచయాత్రను గురించి కొన్ని గ్రంధములు చదివినాడు. క్రీ.శ.1848 ఏప్రిల్‌లో మద్రాసు చేరినాడు. ట్రాంక్విబార్‌లోని తమిళ క్రైస్తవులు ఆయనను వారి సంఘములో పాస్టరుగా పనిచేయుటకు ఆహ్వానించారు. వారి కోరికను ఆయన మన్నించలేదు. తరువాత మచిలీ పట్నం చేరాడు.

వేసవికాలపు విడిదిగా స్టోక్స్‌గారు అదే సమయములో మచిలీపట్టణములో మకాంవేశారు. హయ్యరు మచిలీ పట్నమునకు చేరిన విషయము తెలుసుకొని ఆయనను సాదరముగా ఆహ్వానించారు. హయ్యరుగారు అమెరికా నుండి తెచ్చిన బహుమతులను స్టోక్స్ దంపతులకు అందజేశాడు. అమెరికా ప్రజలకు స్టోక్స్ దంపతుల యెడల కృతజ్ఞతా భావమును వారు అందజేయమని కోరిన శుభములును, అభినందన లేఖను సవినయంగా అందజేశాడు. దానికి ఆనందపరవశుడైన కలెక్టరుగారు అమెరికా సంఘము వారికి ఉచితరీతిని తమ కృతజ్ఞతలు తెలియజేసిరి. హయ్యరుగారు మిషనరీ సేవను ఇంకను అధికముగా చేయవలెనని ప్రోత్సహించిరి. వారి దగ్గర సెలవు తీసుకొని, 1848 మే 15వ తేదీన హయ్యరుగారు గుంటూరు చేరి, గన్ దంపతులను దర్శించిరి. అమెరికా ప్రజల ఆసక్తిని, ప్రోత్సాహమును వినిన గన్ దంపతులు దేవుని కొనియాడిరి.

రాజమండ్రిలో ఉన్న హెయిస్‌గారు, నర్సాపురంలో ఉన్న బీర్‌గారు, గన్‌గారితో కలసి పల్నాటి సీమలో పర్యటించారు. ఇది చాలా వెనుకబడిన ప్రాంతము. ప్రయాణము చాలా కష్టము. ఆ పర్యటనలో గన్‌గారి ఆరోగ్యము కొంతవరకు దెబ్బతినినది. కాని త్వరలోనే కోలుకొని గన్‌గారు, హెయిస్‌గారు, గ్రానింగ్ దొరలకు అభిషేకమునిచ్చు కార్యక్రమమునకు హయ్యరుగారితో కలసి రాజమండ్రి వెళ్ళారు. రాజమండ్రిలో ఉన్న వేలెట్‌గారితో కలసి ఆరాధనలో గన్‌గారు కూడ పాల్గొనిరి. హయ్యరుగారు, గన్‌గారు కలసి గుంటూరులో అనేక ఇంగ్లీషు, తెలుగు బడులను స్థాపించిరి. ఈ బడులలో హిందూ ఉపాధ్యాయులు పనిచేయుట వలన క్రైస్తవ పరిచర్య కొంతవరకు దెబ్బ తినుచున్నది. విద్యావకాశములు లేక వెనుకబడిన బడుగు జీవులకు హయ్యరు స్థాపించిన మిషనరీ బడులు వారికి చదువుకునే అవకాశము కలిగించినవి. కారణమేమనగా బైబిలు, ఇంగ్లీషు తప్పనిసరి పాఠ్యాంశములు.

క్రైస్తవ ఉపాధ్యాయులు దొరకుట అరుదు. ఏది ఏమైనా క్రైస్తవ ఉపాధ్యాయులను నియమించుట మంచిదని తలంచిన మిషనరీలు క్రైస్తవులయిన స్టీఫెన్, రిబ్కాలను ఉపాధ్యాయులుగా నియమించినారు. ఈ ఉద్యోగము వారి సాంఘిక, ఆర్ధిక స్థితిగతులను మెరుగుపరుచుటయే గాక

బానిస బ్రతుకుల నుండి విమోచన కలిగించినది. ఇది దళితులకు గొప్ప చైతన్యాన్ని కలిగించింది. క్రైస్తవులైన దళితులు విగ్రహారాధనను, ఆదివారము పనిచేయుట, చనిపోయిన జంతువుల మాంసము తినుట మొదలగువాటిని మానుకున్నారు. ఇంకా ఎన్నో రకములైన సాంఘిక సవాళ్ళను ధైర్యముతో ఎదుర్కొనినారు. ఈ పాఠశాల శ్రీమతి గన్‌గారి పర్యవేక్షణలో నిర్వహించబడుతుండేది. ఆమె ఆంధ్రలూథరన్ సంఘము యొక్క మొదటి మహిళామిషనరీ. కలెక్టర్ స్టోక్స్‌గారి వలె అసిస్టెంట్ కలెక్టరైన నెవిల్ గారును సువార్త సేవయందు ఆసక్తిగలవారు. వారు కూడా సువార్త సేవకు ఆర్థిక సహాయము అందజేశారు. వీరికి తెలుగు భాషలో గొప్ప పాండిత్యముండుట ఒక విశేషము. అందుచే తెలుగు భాషలో అనేక కరపత్రములను ముద్రించి, పంపిణి చేయించే వారు. కీర్తనల పుస్తకము, పంచాంగము మొదలగు వానిని ప్రచురించినారు. ఇదియు సేవయే కదా! ఒక విదేశీయుడు, అందునా అసిస్టెంట్ కలెక్టరు తెలుగుభాషలో పంచాంగము తయారుచేయుట గొప్ప విశేషము. తెలుగు క్రైస్తవ సంఘమునకు ఎనలేని సేవచేసిన వారిలో అసిస్టెంట్ కలెక్టర్ నెవిల్ గారు ఒకరు. ఆయన జీవితము ఆదర్శమైనది.

రెండవ పల్నాటి యాత్ర (1849) చాలా విశిష్టమైనది. హయ్యరు మొదటిసారి (1844) పల్నాడు వెళ్ళినపుడు నేతగాడైన మాలపాటి జాన్‌తో పరిచయ మేర్పడినది. అతనికి కొన్ని కరపత్రములనిచ్చి పంచి పెట్టవలసినదిగా హయ్యరు కోరెను. హయ్యరుగారు అమెరికా వెళ్ళిన కాలములో జాన్ గుంటూరు వచ్చి, గన్‌గారి వద్ద క్రైస్తవ మతమును గూర్చి కూలంకుశముగా నేర్చుకొనెను. అతడు పల్నాడు తిరిగివెళ్ళి, సువార్త ప్రకటింప మొదలుపెట్టినాడు. 1849లో హయ్యరు గారు రెండవసారి పల్నాడును దర్శించినారు. రూ. 30/–లకు ఒక ఎద్దుల బండిని కొని, దానిని తోలువానికి నెలకు రూ. 5–లు చెల్లించుటకు కుదుర్చుకొన్నాడు. ఎద్దులబండి మీదు కూర్చుని, పల్నాటి ప్రాంతములో అనేక గ్రామములను దర్శించాడు హయ్యరు. నికోదేమను తర్జుమాదారునికి 1200లకు పైగా కరపత్రములను పుస్తకములను ప్రజలకు పంచిపెట్టమని ఇచ్చాడు. వాటిని దాచి పెట్టుకొనడానికి ఒక పెద్ద పెట్టెను కూడా ఇచ్చి అవసరమైతే దానిని సమాధిపెట్టగా కూడ వాడుకోవచ్చునని హెచ్చరించాడు. మరియు కాల్చిన రొట్టెలను కూడా సమృద్ధిగా ఇచ్చాడు. అతనిని తీసుకొని, కొన్ని గ్రామములను దర్శించెను. దారిలోని గ్రామములలో చౌకగాను, విస్తారముగాను, లభించుచున్న కోళ్ళు, పాలు మొదలగు వానిని చూచి ఆశ్చర్యపడెను.

జాన్, నికోదేముల సహాయముతో హయ్యరు గారు అనేక గ్రామములలో సువార్తను ప్రకటించి తెలుగులో ముద్రించిన బైబిళ్ళను, కరపత్రములను పంచిపెట్టి, చివరకు పోలెపల్లి అను గ్రామము చేరి, అక్కడ గన్‌గారి శిష్యుడైన జాన్ వద్ద బసచేశారు. జాన్‌చేత బోధింపబడిన వారై క్రీస్తును రక్షకునిగా అంగీకరించిన ఇరవై మంది నేతగాండ్రను పరామర్శించి, వారికి రక్షణను గూర్చిన మరికొన్ని విషయాలను బోధించిన మీదట 22 మందికి ఫిబ్రవరి 12, 1849న బాప్తీస్మమిచ్చాడు. 1849 ఫిబ్రవరి 12న పల్నాడు లూథరన్ సంఘము స్థాపింపబడినది. బానిస జాతులు విమోచన కొరకు కనిపెట్టుకొనియున్నారు. ప్రేమతో కూడిన పరిచర్య, బడుగుల బాగోగుల గురించి మిషనరీలు తీసుకొనుచున్న శ్రద్ధ తోటి మానవులుగా వారిని అంగీకరించుట మొదలగు లక్షణములుండుట వలన వారు క్రైస్తవ మతమును అంగీకరించారు. ఇందులో ఏమీ బలవంతము లేదు. ఇది ఒక సామూహిక ఉద్యమము. ఇది జాన్ యొక్క విజయము. తదుపరి క్రోసూరు వచ్చి, అచ్చుట కరణం గారి తోను, మరికొంతమంది నిష్ఠగల హిందువులతోను యేసు యొక్క ప్రేమను గూర్చి బోధించిరి. కానీ కరణము మాత్రము క్రైస్తవ పాఠశాలను స్థాపించుటకు ఒప్పుకొనలేదు. అయితే ప్రజలు పాపమును గూర్చి ఏ విధమైన భీతి లేకుండుట చూచి నొచ్చుకొన్నాడు. రోజుకు సుమారు 40–50 మైళ్ళు దూరము నడిచి, ఆ ప్రాంతమంతటిలో సువార్తను ప్రకటించెను. నడక కష్టమనిపించలేదు. కానీ దోమల బాధను తట్టుకొనలేక పోయాడు.

(సశేషం)

**మీ జీవితానికో అద్భుతం అవసరమా?**

అలాగైతే గుంటూరు, కన్నావారు 4వ లైన్లోని ఎల్షద్దాయ్‌చర్చిలో

**ప్రతినెల రెండవ శనివారం రాత్రి 10గంటల నుండి ఉదయం 5 గంటల వరకు**

ప్రజలందరికీ **జరిగే సంపూర్ణరాత్రి ప్రార్థనారాధన** లో ఆహ్వానం

బంధుమిత్ర సమేతంగా పాల్గొని దైవాశీస్సులు పొందండి.

అంతర్జాతీయ సువార్తికులు, అద్భుతఘడియ T.V.కార్యక్రమ సందేశకులు (9 నిమిషాలు గుండె ఆగి మృతిచెంది యేసుప్రభుని కృపవలన సజీవులైన) **బిషప్ డా॥శాంతవర్ధన్ గారు** దైవ సందేశమిచ్చి ప్రతిఒక్కరికి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

గమనిక: గుంటూరు, ఎల్షద్దాయ్‌చర్చిలో ప్రతి ఆదివారం ఆరాధన ఉదయం 11-00 గంటల నుండి మధ్యాహ్నం 2-00 గం॥ల వరకు

ప్రతి మూడవ శనివారం సా॥ 6 గం॥ల నుండి రాత్రి 10గం॥ల వరకు విజయవాడ, ప్రభోధబుక్‌సెంటర్,C.S.i ఆడిటోరియంలో వీరిచే మహిమాన్వితసభ జరిగించబడును.

ప్రతి సోమవారం ఉదయం **గం.6-30 ని.లకు "అద్భుతఘడియ"**T.V కార్యక్రమం '**శుభవార్త**' T.V ఛానల్లో వెలువడును.

అత్యవసరప్రార్థనాఅక్కరలకుఫోన్(0863)2354536,సెల్:09848113886

Email:santhavardhan@yahoo.com.

Web:www.goodnewsmessengers.org.in

**FOR FREE CORRESPONDENCE COURSES WRITE TODAY**

ABUNDANT LIFE STUDIES, P.O. BOX-318, GUNTUR-522004 (CELL:9959952838)

Website:www.abundantlifestudies.org.in

**సమృద్ధి జీవం అధ్యయనాలు**

(ఇంగ్లీష్, తెలుగు భాషలలో)

ఉచిత కరస్పాండెన్స్ కోర్సుల నిమిత్తం నేడే మాకు వ్రాయండి.

మా అడ్రస్: అబండెంట్ లైఫ్ స్టడీస్, పోస్ట్‌బాక్స్-318, గుంటూరు-522004 (ఫోన్:9959952838)

**మీ వీడియో, ఆడియో అక్కరలకై సంప్రదించండి**

**జేకి డిజిటల్స్**

1/2 సూర్యటవర్స్(బెంజిసర్కిల్ వద్ద)
నారాచంద్రబాబునాయుడు కాలనీ
విజయవాడ-520010
(ఫోన్:9849819094)

**For your VIDEO & AUDIO NEEDS VISIT JAKIE DIGITALS, VIJAYAWADA-520010**

# సువార్తలేని కరువు ప్రాంతములు

**10 గ్రామములకు ఒక్క సువార్తికుడు, సంఘకాపరి కూడా లేని సువార్త కరువు ప్రాంతముల విషయములో ఆత్మల భారము కలిగిన సువార్తికులు, సంఘకాపరులు, మిషన్ ఆర్గనైజేషన్స్ మమ్ములను సంప్రదించినచో పై ప్రాంతముల వివరములు తెలియజేసెదము.**



## క్విజ్ నవంబర్ నెల ప్రశ్నలు 68

పాఠకులను వాక్యపు జ్ఞానంలో పెంచటమే ఈ శీర్షిక ఉద్దేశ్యం.

## సామెతలు 11 నుండి 20 వరకు

**సామెతలు జ్ఞాని అయిన సొలొమోను లోకజ్ఞానము, మరియు దైవ జ్ఞానమును గురించి వ్రాయబడిన గ్రంథము.**

**1. ఎఫెసీ 5-23 ప్రకారము శిరసైన పురుష్యునికి భార్య శరీరము మాత్రమే. కాని యోగ్యరాలు పెనిమిటికి శరీరము మాత్రమే కాదు మరేమిటి?**

**2. శరీరమునకు అకారమునిచ్చు ఏముకులకు, (ఎ) పుష్టి, (బి) ఆరోగ్యము, (సి) కులు మరియు (డి) వాటిని ఎండిపోజేయును ఏమిటి?**

### ఈ నెల పోషకులు :

| | | |
|---|---|---|
| శ్రీ యడవల్లి ప్రసాదరావు | వరంగల్ | 2000 |
| శ్రీ జడ్.సి. దేవదానం | కర్నూలు | 1000 |
| బిషప్.డా॥ఎమ్.ఎస్.శాంతవర్ధన్ | గుంటూరు | 1000 |
| డా॥ పిక్కిలి హుస్సేనయ్య | బేస్తవారిపేట | 1000 |
| శ్రీమతి స్వతంత్ర కుమారి | రాజమండ్రి | 1000 |
| శ్రీ బి. జకరయ్య | హైదరాబుదు | 600 |
| అపో॥ ఎబినేజర్ | హైదరాబాదు | 500 |

బెంగుళూరు నెషనల్ ఎయిరా న్యూటికల్స్ యస్.బి.ఐ బ్రాంచి నుండి పేరు చెప్పనివారు ఆన్‌లైన్‌లో 500 వందలు పంపించారు.

| | | |
|---|---|---|
| శ్రీమతి దేవకరుణమ్మ | చీమకుర్తి | 300 |
| ఆర్టిస్టు. ఆర్.పి. | ఉదయగిరి | 300 |
| చోరగుడి. కనికరమ్మ | కోలవెన్ను | 300 |
| శ్రీ. యాసిన్ భాషా | కనిగిరి | 200 |
| ప్రసన్న భారతి | ఒంగోలు | 200 |
| శ్రీమతి వాసంతి | కొత్తపట్నం | 200 |
| శ్రీ దైవాశీర్వాదం | ఏలూరు | 200 |
| శ్రీ టెంటు శేకర్ | విజయవాడ | 200 |
| శ్రీమతి యమ్. చంద్రకళ బోయోజు | ఒంగోలు | 200 |
| శ్రీ జంగాల ఆనందం | ఒంగోలు | 200 |
| శ్రీమతి కూచిపూడి సౌభాగ్యం | ఒంగోలు | 200 |

**అక్టోబర్ నెల ప్రశ్నలకు జవాబులు:**

**1. జ్ఞానమునకు ముఖ్యాంశము ఏమిటి?**

**జవాబు :** జ్ఞానము సంపాదించుకొనుటయే జ్ఞానమునకు ముఖ్యాంశము. **సామెతలు 4:7.**

**2. సామెతలు గ్రంథము యొక్క మూల వాక్యము "యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట" అనే వాక్యము ఎన్ని సందర్భములో చెప్పబడినది?**

**జవాబు :** ఆరు సందర్భములో చెప్పబడినది. **సామెతలు 1:7, 1:29, 2:5, 8:13, 9:10, 10:27.**

**జవాబులు ప్రయత్నించిన వారు :**

**శ్రీమతి జి. అన్నమ్మదానియేలు (నరసరావుపేట)**
**శ్రీమతి శాంతాగ్రేస్ (మచిలీపట్నం)**
**పాల్వాయి ధర్మేష్ (అమీనపురం)**
**శ్రీమతి పి.యమ్. సుశీల రాజరావు (నరసరావు పేట)**
**టి. క్రిష్టియానమ్మ (నందికొట్కూరు)**
**సి.హెచ్. సంపూర్ణ సాల్మన్ (నరసారావు పేట)**

### 8 వ పేజి తరువాయి భాగం

మీద అడుగుపెట్టిన తారీఖు ఫిబ్రవరి 5 అని ఎవరు గుర్తుపెట్టుకొనక పోయినప్పటికి దేవుడు ఆ తారీఖు నిర్ణయించారు.

ఆ సభలకు అధ్యక్షునిగా డా.జూవెట్ నడిపించ వలసి యుండగా సభలు ప్రారంచబడే సమయానికి జూవెట్ భార్య అస్వస్థత కారణముగా జూవెట్ దంపతులు అమెరికా వెళ్ళటానికి ఓడ ఎక్కారు. ఈ సంగతి జూబిలి తారీఖులు ప్రారంభించినప్పుడు క్లౌ దొర భార్య దౌని సభకు తెలియ చేసారు. సభ చాలా నిరుత్సాహ పడినది. జూవెట్ సభలో అలంకరించ బడవలసిన కుర్చీని పూలతో అలంకరించి, జూవెట్ అక్కడ అధ్యక్షునిగా ఉన్నట్లు భావించారు.

పెద్ద కథ

# విశ్వాసంలో మరో మెట్టు 13

ఇప్పుడు మీరు పత్రిక ప్రారంభించి రెండు సంవత్సరాలు అయ్యుంటుంది. కనుక మీ పత్రిక రిజిష్టరు కాదు. కనుక "నిత్యజీవజలము"ను దాని ఎడిటర్‌ను మర్చిపోయి క్రొత్త పత్రికను క్రొత్త పేరుతో ప్రారంభించండి. నేను ఇక్కడ ఢిల్లీ నుండి మీకు సహాయం చేస్తాను. అని వ్రాశారు. దేవుని కార్యాలు అలాగే ఉంటాయి. "జస్వంత్ లాల్" ఎవరు? దేవుడు ఏర్పరచిన వ్యక్తి.

వెంటనే "హన్నాకృప" మొదటి పేరుగా మూడు పేర్లతో ఒంగోలు కలెక్టరు ఆఫీసులో టైటిల్ వెరిఫికేషన్‌కు సామ్యేలు ముఖ్య సంపాదకునిగా ధరఖాస్తు చేశాడు. అది నెరవేరిన తర్వాత జస్వంతలాల్‌గారు రిజష్టర్ ఎలా చేయాలో దానికి సంభందించిన పుస్తకము ఒకటి పంపారు. సూచనల ప్రకారం సరియైన పద్ధతిలో చేయక పూర్తిచేసిన ధరఖాస్తును యన్.ఆర్.ఐ.కి ఢిల్లీ పంపితే, జస్వంతలాల్‌గారు కోపపడి ఆయన మరలా సరిచేసి ఎంతో శ్రమపడి "హన్నాకృప" రిజష్టరు చేయించాడు.

తర్వాత ఒంగోలు సీనియర్ సూపరిటెండెంటు ఆఫ్ ఫోస్టాఫీస్ వారి దగ్గర దరఖాస్తు చేసి, ఫోస్టల్ రాయితీ తెచ్చాడు. అందువలన నాలుగు రూపాయల్లో తపాలా బిల్లకి బదులు రూపాయలో నాల్గవ వంతు (పావలా)తో పత్రిక పోస్టు చెయ్యగలిగాడు. పత్రికల సంఖ్య వెయ్యి దాటింది. చందాకట్టినా, కట్టకపోయినా పత్రిక అడిగిన వారందరికి పంపించగలిగాడు.

పత్రిక పేరు మార్చిన తర్వాత, సంపాదకీయము మారిన తర్వాత అంత వరకు పత్రికకు ఏదో కొంత ధన సహాయం చేస్తున్న వారు సహాయం నిలిపివేశారు. అప్పుడు పత్రిక పేజీలు 24 మాత్రమే! కవరు పేజి రెండు రంగులతో మాత్రమే ప్రింటు అయ్యేది. ఇప్పుడు "హన్నాకృప" పత్రిక చీఫ్ఎడిటర్ పేర్లు మాత్రమే పత్రికలో ప్రింటు అవుతున్నాయి. "నిత్యజీవజలము"నకు ఆర్థిక సహాయం చేస్తున్నవారందరు సహాయం నిలిపివేశారు.

మనుష్యుల సహాయంతో నడిచే ఏ పత్రిక అయినా కొంతకాలానికి నిలిచిపోతుంది. అంతే కాక సొంత డబ్బా వాయించుకోవటానికి విడుదలయిన పత్రికలు వందలో, వేలలో ప్రారంభించి మూతపడ్డాయి. ఇక పత్రిక ప్రారంభించ టానికి మొదట అప్లికేషన్ కలెక్టరు ఆఫీసులో ఇచ్చి వాటి విషయం పట్టించుకొననివి వందల్లో ఉన్నాయి.

ఏ ఆలోచన అయినా, ఏ కార్యమైనా మనుష్యుల వలన కలిగినా అది వ్యర్థమగును. దేవుని వలన కలిగిన దానిని ఎవరూ వ్యర్థపరచలేరు.

సామ్యేలు "కనిగిరి"లో నివశించేటప్పుడు "గైడ్ పోస్ట్" అనే అమెరికా నుండి వచ్చే మాసపత్రికను తెప్పించు కొని చదివేవాడు. దానిలో కేవలం వ్యక్తిగత సాక్ష్యాలు మాత్రమే ఉండేవి. ఇటువంటి పత్రిక తెలుగులో ఉంటే ఎంత బాగుండును అని అనుకునేవాడు. ఇప్పుడు తను ఓ పత్రిక నడిపిస్తున్నాడు. కనుక కేవలం సాక్ష్యాలు మాత్రమే ప్రచురించాలి అనుకున్నాడు. పత్రిక ఏ సంస్థకు సంబంధించి నది కాదు. లేక నలుగురు ఏకమై నడిపే పత్రికకాదు. కేవలం సాక్ష్యాలు మాత్రమే నడిపించాలి. తన ఇష్టాను సారంగా అంటే దేవుని చిత్తనుసారముగా నడిపించాలి. ఏ ప్రలోభానికి లొంగకూడదు. ధనవంతులను సంతోషపరచి ధనార్జన చేయకూడదు.

పత్రికలో ఫోటోలు సగం స్థానము అక్రమిస్తాయి. కనుక బ్రతికి ఉన్న వారి ఫోటో ఏది ముద్రించకూడదు. ప్రకటనలు, అది సువార్త సేవకైనవి అయినా సరే డబ్బు సంపాదన కొరకు ప్రచురించకూడదు. కాని తన వ్యక్తిగతమైన తృప్తి కొరకు మానవులకు శరీరకముగా, ఆత్మీయముగా ఉపయోగపడే ప్రకటనలు కేవలం సామ్యేలు వ్యక్తిగత బాధ్యత మీద ప్రకటించాలని ఉద్దేశించినది. ప్రచురించాలని నిర్ణ యించుకున్నాడు.

దేవుడు నడిపే పత్రిక అయితే పేపరు, ప్రింటింగ్ అప్పుచెయ్యకూడదు. ఇది దేవుని చిత్తానుసారమైనది అయితే

ఆయనే డబ్బులు ఇచ్చి నడిపించాలి. ఆయన అలా నడిపించకపోతే పత్రిక నిలచిపోతుంది. తన వలన లేక తన పొరపాటు వలన పత్రిక ఆగిపోతే దానికి తనే బాధ్యుడు. అయితే దేవుడు ధనసహాయం చెయ్యనందువలన పత్రిక నిలిచిపోతే ఈ పత్రిక నడపటం దేవునిచిత్తము కాదని గ్రహించాలి అని అనుకున్నాడు సామ్యేలు.

తపాలాశాఖవారి రాయితీ లభించిన తర్వాత పత్రిక పోస్టింగ్ తారీఖు ప్రతినెల మొదటి తారీఖున నిర్ణయించాడు. అంటే ప్రతినెల చివరిరోజుకు పత్రికను తయారుచేసి, కట్టలు కట్టి, సిద్ధపరచి ఒకటవ తేదిన పోస్టాఫీస్‌లో ఇవ్వాలి. అలా నిర్ణయించబడిన రోజు దాటిపోతే ఒక్కదానికి నాలుగు రూపాయల బుక్‌పోస్టు స్టాంపు వెయ్యాలి. అలా ప్రతి పత్రికకు వెయ్యాలి.

అంటే ప్రతినెల పత్రిక కొరకు దేవుడు పదివేల రూపాయలు పంపించాలి. ఎవరితో? ఏమో! పత్రికకు అవసరమైన పదివేలు ఎంతమంది ఇస్తారో? ఎవరూ ఇస్తారో? ఎప్పుడు ఇస్తారో? తెలియదు. కాని నెలగడిచే సమయానికి ప్రతినెల పదివేలు రావాలి. ప్రతినెల విశ్వాస పరిక్ష. ఇంతవరకు ఒక్క నెల అయినా పత్రిక ఆగలేదు. ఇకముందు ఆగదు.

▪ ▪ ▪

ఒంగోలుకు 140 కిలోమీటర్ల దూరంలో గిద్దలూరు పట్టణంలో జంగాల చంద్రశేఖర్ అనే సువార్తికుడు ఓ రోజు సామ్యేలు దగ్గరకు వచ్చి, ప్రతినెల మొదటి ఆదివారం మా సంఘములో వాక్యము చెప్పమని అడిగాడు. గిద్దలూరులో ఉదయం 9.30గం॥లకు ఉండాలంటే ఒంగోలు నుండి ఏ బస్సు లేదు. అందువలన శనివారం రాత్రి బయలుదేరాలి.

సామ్యేలు జీవితంలో మొదటి జీతం డాక్టర్. హుస్సేనయ్య గారి చేతులు మీదుగా 1981 నవంబరు మొదటి తారీఖున తీసుకున్నాడు. తర్వాత కాలక్రమంలో వారి ఇంటిలో ఒక సభ్యునిగా భావించబడ్డాడు. పెద్దకుమార్తె "అరుణ" అమెరికాలో ఉంటుంది. రెండవ కుమార్తె "వసుంధర" కర్ణాటకలో ఉంటుంది. కుమారుడు "గిరిధర్" హైదరాబాదులో మెడిసన్ చదువుతూ ఉన్నాడు. డాక్టరు గారి భార్య ఈ మధ్యనే పరమపదించినది. అందువలన ఆయన ఒంటరిగా బేస్తవారిపేటలో సొంత హాస్పిటల్ నడిపిస్తున్నాడు. అందువలన శనివారం రాత్రి డాక్టర్. హుస్సేనయ్యగారి దగ్గర బసచేసి, ఉదయం 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిద్దలూరు వెళ్ళేవాడు. అయితే శనివారం రాత్రి హాస్పిటల్‌లో ఆఫీసులో దేవుని సంగతులు ఎక్కువగా మాట్లాడుకొనేవారు.

కొన్ని నెలలు గడచిన తర్వాత ఓ శనివారం రాత్రి "కాన్పుకేసులు" ఉండి నందున డాక్టరుగారి గదిలో కూర్చోని మాట్లాడుకుంటున్నారు. రాత్రి 10.30గం॥లు అయింది. హుస్సేనయ్యగారు తన టేబుల్ పై డ్రాయరు తెరచి వంద రూపాయల కాగితాలు పది సామ్యేలు చేతిలో ఉంచాడు.

"ఏం సార్! ఒంగోలు నుండి ఏమైనా తీసుకొని రావాలా?" అని అడిగాడు సామ్యేలు.

"అదేం లేదు, చాల కాలంగా ప్రతినెల నీకు వెయ్యి రూపాయలు ఇవ్వాలని అనుకుంటున్నాను. కాని నువ్వు అందుబాటులో లేవు. ఇప్పటి నుండి ప్రతినెల వెయ్యి రూపాయలు తీసుకో!" అని అన్నారు.

"ఎందుకు సార్?" అన్నాడు సామ్యేలు.

"నువ్వు చాలమంచి పనిచేస్తున్నావు" అన్నాడు. పూర్వకాలము 1981 నుండి 83 వరకు సామ్యేలు ఆయన దగ్గర డ్రైవర్‌గా పనిచేసేటప్పుడు సామ్యేలుకు ఉన్న అసహ్యకరమైన అలవాటుకు తనలో తనే నిత్యం బాధ పడుతుండేవాడు. కాని చదువుకొన్న డ్రైవర్, తనకంటే వయసులో రెండు సంవత్సరాలు పెద్దవాడైన సామ్యేలును ఏమి అనలేక ఊరుకున్నాడని సామ్యేలుకు తెలుసు. ఇప్పుడు తన జీవితం చూసి, యేసుప్రభువు దగ్గర పనివానిగా పనిచేస్తున్న సామ్యేలును చూసి డాక్టరుగారు ఎంత సంతోషిస్తున్నాడో ఆయన మాటలలో అర్థమయింది.

"నేనేమి పనిచేస్తున్నాను సార్! యేసుప్రభువు పనేగా!" అన్నాడు సామ్యేలు.

**(సశేషం)**

# ఆయన చేసిన ఉపకారములు

ఏప్రిల్ నెల పత్రిక కొరకు పేపరు కొన్నాము. టైటిల్ పేజికి కావలసిన పేపరు కొనాలి. అందుకుగాను ఇంకా 300 రూపాయలు అవసరము. 3వ తారీఖు ఉదయం 300రూ. ఉంటే ఆ పేపరు కొనవచ్చును. దేవుడు ఎవరిద్వారా పంపిస్తాడోనని ప్రార్థించి, ఎదురు చూస్తున్నాను. సాయంకాలం అయింది. రాత్రి 8 అయింది. 9 గంటలకు పేపరు కొట్టు మూసివేస్తారు. ఆఫీసులో నుండి బయటకు వచ్చి కూర్చున్నాను. తెల్లవారితే ఆదివారం. ప్రెస్ వాళ్ళు పనిచేయరు. ఈ రాత్రి పేపరు ఇస్తే, రాత్రి ఎంత సమయం లోనైనా పనిచేస్తారు.

సోమవారం పేపరు కొట్టు 10గంటలకు తెరచినా, ప్రెస్ వాళ్ళు సోమవారం సాయంకాలానికి మాత్రమే ఇస్తారు. ఆ పేపర్లు తెచ్చి, ఇంపోజు చేసి (పేపర్లు పేజీల వారీగా కూర్చి పుస్తకం తయారుచేయటం) పిన్నులు వేయటం, కటింగ్ మిషన్ దగ్గరికి తీసుకొనివెళ్ళి కట్ చేసి పుస్తకాలు మడచి కవర్లలో పెట్టి మంగళవారం సాయంకాలం మూడు గంటలకు (మూడు గంటలు దాటితే పోస్టు చేయనివ్వరు) రైల్వే ఆర్.యం.యస్.కు తీసుకొని వెళ్ళగలమా?

అసలు ముందు మూడు వందలు కావాలి కదా! ఇంతలో ఎవరో వచ్చి సౌభాగ్యము టీచరు గారు అరుణ డయాబెటిక్ హాస్పిటల్‌లో రెండు రోజుల క్రితం అడ్మిట్ అయ్యారని చెప్పారు. రాత్రి 9 అయింది. లేచి ఇంట్లోకి వెళ్ళి నిద్రపోయాను.

తెల్లవారి 9 గంటలకు నేను, నా కుమారుడు నతానియేల్ ఆదివారం ప్రార్థనకు కొండమీదకు బయలు దేరాము. "ముందు హాస్పిటల్‌కి వెళ్ళి సౌభాగ్యము టీచర్‌గారిని చూసి ప్రార్థన చేసి వెళ్దాము" అన్నాను.

"9.30 అయ్యింది. ప్రార్థనకి సమయం సరిపోదు" అన్నాడు. "మరి టీచర్ గారిని దర్శించకుండా వెళ్తే వాక్యము సరిగా చెప్పలేనేమో!" అని ఇద్దరం హాస్పిటల్‌కి వెళ్ళాము.

టీచరు గారు మమ్ములను చూచి చాల సంతో షించారు. "రోజుకు 500/–లు ఖర్చు అవుతుంది. డబ్బుకు చాలా ఇబ్బందిగా ఉన్నది. మా అబ్బాయి ఎక్కడో 200/– అప్పుగా తెచ్చాడు" అని చెప్పింది.

టైమ్ సరిపోదు. మేము మోకరించి ప్రార్థన చేసి బయటకు వస్తుంటే, "అయ్యా! కొంచెం ఆగండి" అని బ్యాగ్‌లో నుండి 300/– తీసి నాకు ఇస్తుంది. నాకు చాల బాధ వేసింది. "అసలే ఇబ్బందిలో ఉన్నారు. ఇప్పుడు ఇలా చందా ఇవ్వటం, నేను తీసుకోవటం ఎలా?" అన్నాను.

"వారం క్రితం మీ కొరకు 500/– తీసిపెట్టాను. ఈ మధ్య హాస్పిటల్‌లో ఉండటం వలన 200/– ఖర్చు అయినాయి. ఆ డబ్బు వాడినందుకు బాధపడుతున్నాను. దయచేసి ఈ డబ్బు వద్దు అని అనవద్దు" అన్నది.

నిన్న సాయంకాలం నుండి ఎన్నో అవిశ్వాసమైన ఆలోచనలతో నేను ఆలోచించాను.

"అమ్మ! నాకు కావలసిన 300/–లు ప్రభువు మీ దగ్గర ఉంచాడు" అని మధ్యాహ్నం ప్రార్థన అయిన తర్వాత దారిలో పేపరు షాపు తెరచి ఉండటము చూచి, ప్రభువునకు స్తోత్రము చేసి, పేపరుకొని ప్రెస్‌కి వెళ్తే వాళ్ళు ఉన్నారు. సోమవారం ఉదయం ప్రింట్ అయిన పేపర్లు ఇచ్చారు.

అప్పటినుండి సోమవారం ఉదయం నుండి మంగళవారం వరకు నిద్రపోకుండా పనిచేసి కటింగ్‌మిషన్ వద్దకు బయలుదేరాము. ఉదయం నుండి కరెంటు లేదు. సాయంకాలం నాలుగు గంటలకు కరెంటు వస్తుంది అన్నారు. అప్పుడే కటింగు చేస్తారు అని తెలిసింది.

అయినా రిక్షా పిలిపించి కటింగ్‌మిషన్ వద్దకు బయలుదేరాము. మేము అక్కడికి చేరేటప్పటికి కరెంటు వచ్చింది. అరగంటలో కటింగ్ అయింది. పదిమందిని సహాయం తీసుకొని పుస్తకాలు కవర్లలో పెట్టడం స్టాంపులు అతికించటం పూర్తి చేసుకొని సరిగ్గా 3 గంటలకు ఆర్.యం.యస్.కి బయలుదేరాము.

ప్రతినెల ప్రభువు మమ్ములను విశ్వాసములో నిలువనిచ్చి, పత్రికను సకాలములో మీకు అందజేయు చున్నందుకు ఆయనకు స్తుతి స్తోత్రములు.

## 11వ పేజి తరువాయి భాగం

లోని భీమిలి. చిన్న వయస్సులోనే తూర్పు గోదావరి జిల్లాకు వచ్చారు. విశ్వబ్రాహ్మణ కులంనకు చెందినవాడు. మిషనరీల దగ్గరచేరి మొదట్లో పంకాలాగే ఉద్యోగము చేసి, యేసును స్వరక్షకునిగా స్వీకరించి, రక్షణ పొంది, బైబిలు ట్రెయినింగ్ పొంది, కాకినాడలోని కెనడియన్ బాప్టిస్టు మిషన్ చర్చిలో పాస్టరుగా పనిచేసాడు.

ఆయన క్రైస్తవుల అమ్మాయిని పెండ్లి చేసు కున్నాడు. వారిది "కాలేరు" గ్రామము. ఆమెకు బ్లడ్‌కేన్సరు వ్యాధి వచ్చింది. ఆ ఊరి డాక్టరుగారు మద్రాసు దగ్గర రాయవేలూరు మిషన్ హాస్పిటల్‌కి వెళ్ళమన్నారు. అక్కడికి వెళ్ళటానికి మనిషి ఒక్కంటికి పాతిక రూపాయలు చార్జి కావలయును. భానుమూర్తి గారి జీతం నెలకు 12 రూ/-. కనుక చర్చి కమిటి వారి సహాయం కొరకు మూడు నెలలు వారి చుట్టు తిరిగాడు. కాని వాళ్ళకు మనస్సు రాలేదు.

విసిగిపోయిన భానుమూర్తిగారు చావుబ్రతుకుల మధ్యనున్న తన భార్యను తీసుకొని వచ్చి, కాకినాడ చర్చిలో నాలుగు అడుగుల ఎత్తున ఉన్న సిలువ దగ్గర తన భార్యను పరుండబెట్టి ఏడుస్తూ ప్రార్థన చేస్తుంటే, అదే సమయములో సిలువవద్ద నుండి రెండు చేతులు వచ్చి ఆమెను లేపి నిలువ బెట్టినవి. కండ్లు తెరచి చూస్తే, భార్య లేచి నడుస్తుంది. అప్పుడు ఆ సిలువ యొద్ద కూర్చుండి, సిలువే నా శరణా యెనురా అనే పాట వ్రాశాడు.

ఇప్పుడు ఆయన మనుమలు - పల్లె రాజబాబు గారు కాకినాడలో కెనడియన్ బాప్టిస్టు సెమినరీలో పని చేయుచున్నారు. ప్రదీప్‌గారు కాలేరులోని సి.బి.యం. చర్చి పాస్టరుగారిగా పనిచేయుచున్నారు.

ఓ సాయంకాలం చర్చిలో నా రెండవ మేనల్లుడు పాస్టరు సింసన్ మాట్లాడుతుంటే విన్నాను. ఆయన్ని నా ఆఫీసులోనికి పిలిపించి, ఇందాక చర్చిలో చెబుతున్న విషయాన్ని రాసి ఇస్తావా? "హన్నాకృప"లో ప్రచురిస్తాను అని అడిగాను. అప్పుడు రాసిచ్చిన దానిని 2004లో ప్రచురిం చాను. ఇప్పుడు సందర్భము వచ్చింది కనుక మీరు చదవండి.

## 23వ పేజీ తరువాయి భాగం

ధ్యేయం ఒక్కటి ప్రభువు పంపాడు, ప్రభువే నన్ను నడిపిస్తాడు. ఆయన నా తండ్రి. ఆయన పని నేను బాధ్యతగా చేస్తాను అని నిర్ణయించుకున్నాను.

ఒక ఆదివారం రోజు సండేస్కూల్ నడిపిస్తున్నాను. ఒక కారు వచ్చి ఆగింది. అందులో నుండి ఒక వ్యక్తి విడియో కెమెరా పట్టుకొని మమ్ములను తీస్తున్నాడు. నేను భయపడ లేదు. తరువాత ఒక వ్యక్తి వచ్చి మేము టి.వి.9 వాళ్ళము అని పిల్లలను కొన్ని ప్రశ్నలు అడిగారు. పిల్లలు ఉన్నమాటే చెప్పారు. "మిమ్మల్ని తెల్ల డ్రస్సు వేసుకోమని, కాషాయము రంగు వేసుకోవద్దని, బొట్టు పెట్టుకోవద్దని మేడమ్ చెప్తారా?" అని కొన్ని ప్రశ్నలు అడిగారు. పిల్లలు "మేడమ్ మాకు అలాంటివి ఎప్పుడు చెప్పలేదు. యేసయ్య దేవుడు అని చెప్పేది" అని అన్నారు. పాస్టరు వాళ్ళ పిల్లల్ని పోగుచేసి మేడమ్ కాషాయము రంగు బట్టలు వేసుకోవద్దన్నది, ఇలాంటి కొన్ని వ్యతిరేక విషయాలు చెప్పించి, ఈ రీలులో అవి కలిపి టి.వి.9కి పంపించారు. అయితే ఆ టి.వి.9 వాళ్ళు మా ఇంట్లో నుండి వెళ్ళేటప్పుడు – "చాలా థ్యాంక్స్ అండి. మేము టి.వి.లో డబ్బు కట్టకుండ వస్తున్నందుకు" అన్నాను వాళ్ళు ఆశ్చర్యపోయారు.

"నేను, నా భర్త కరపత్రికలు పంచుతూ, అనేక గ్రామాలు తిరిగాము. నడికుడి అనే గ్రామానికి వెళ్ళినప్పుడు అనేక యౌవనస్థులు మమ్ములను పంచనివ్వలేదు. క్రికెట్ బ్యాట్‌లతో కొట్టటానికి వచ్చారు. ఆ గ్రామాన్ని విడచి వేరే గ్రామానికి వెళ్ళాము. ఆ గ్రామానికి వెళ్ళి పత్రికలు పంచ గలిగాము. ఆ గ్రామం పేరు వాల్గోండ.

మేము పత్రికలు పంచటానికి నెలకి 7000రూ. చార్జీలకు ఉంచుకొనేవారము. ఎవరైన విశ్వాసులు వస్తే తీసుకెళ్ళేవాళ్ళము.

కొన్ని సాక్ష్యాల క్యాసెట్లు టేప్‌రికార్డులో వేసుకొనే వాళ్ళము. ఒక్క సాక్ష్యం 3,4 టేప్‌లు చేపించి అనేక గ్రామాల్లో వింటాము. మా టేప్‌లో వేసుకుంటాము అనేవాళ్ళకు ఇచ్చి మళ్ళీ నెలకి వెళ్ళి ఆ క్యాసెట్లు తెచ్చుకొనేవాళ్ళము.

# కీ॥శే॥ వై.యస్. చిన్నకొండా రెడ్డి గారు

2

స్వీయ చరిత్ర

మా తండ్రి వై.యస్. వెంకటరెడ్డిగారు మాకు బాల్యం నుండి చక్కని ప్రార్థనా జీవితమును అలవాటు చేశారు. ప్రతిదినము మా కుటుంబములో సాయంత్రవేళ భోజనం అయిన తరువాత తప్పనిసరిగా కుటుంబ ప్రార్థన జరిగేది. కుటుంబ ప్రార్థన తరువాతనే నిద్రపోవాలి. కుటుంబ ప్రార్థనలలో మా తండ్రిగారు దేవుని పరిశుద్ధ గ్రంథంలో నుండి అనేక సంగతులను మాకు బోధించేవారు.

**వివాహము:-**

నేను యుక్తవయస్సులో ఉండగా నాకు పరిశుద్ధ వివాహము జరిపించుటకు మా పెద్దలు కమలాపురం తాలూకా ఉలవలపల్లె రాజుపాళెం గ్రామ వాస్తవ్యులైన పాళెం పెద్దసుబ్బారెడ్డిగారి రెండవకుమార్తె అయిన రాజమ్మతో వివాహము జరిపించుటకు నిశ్చయించినారు. 1932 వ సం॥రం డిసెంబర్ 29 వ తేదీన దేవుని ఆశ్చర్యమైన మహాకృపను బట్టి నా వివాహం బలపనూరు పడమటి దిక్కున ఉన్న ఒక తోటలో పరిశుద్ధ దేవుని యాజకులైన రెవ.వై.సతేయజోసఫ్ గారి ఆధ్వర్యములో జరిగినది.

మా బంధుమిత్రులు, రైతు సోదరులు, సమీప గ్రామస్థులలో అధిక సంఖ్యాకులు క్రైస్తవేతరులు గనుక ఈ క్రైస్తవ వివాహమెట్టిదో, ఏ విధంగా వై.యస్. వెంకటరెడ్డి గారి కుమారుడు చిన్న కొండారెడ్డి గారి వివాహం జరిగిస్తారో చూచుటకు అనేకులు ఆశ్చర్యపడుతూ రావటం జరిగింది. అప్పటికే క్రీస్తును స్వరక్షకునిగా అంగీకరించి, ఆరాధిస్తున్న శ్రీ వేల్పుల పౌలురెడ్డి, శ్రీ సర్వాయపల్లె నాగిరెడ్డి, కడపనుండి రాంపాస్ దొరగారు వచ్చి ఉన్నారు. ఆ దినములలో బస్సు సౌకర్యము లేనప్పటికీ అనేకులు నా వివాహమునకు హాజరయ్యారు. మా కుటుంబములలో నాది రెండవ క్రైస్తవ వివాహము. ఎట్లనగా మా అన్నయైన పెద్దకొండారెడ్డి గార్కి 1929వ సంవత్సరంలో కమలాపురం తాలుకా ఉరుటూరు గ్రామమునకు చెందిన డాక్టర్ మారెడ్డి జోజిరెడ్డిగారి కుమార్తె మరియమ్మతో జమ్మలమడుగు తాలూకా నాగరాజు పల్లెలోని రోమన్ క్యాథలిక్ చర్చిలో పరిశుద్ధ వివాహం జరిగింది.

"సుబుద్ధి గల భార్య యెహోవా అనుగ్రహించు దానము" అని సామెతలు 19:14లో సెలవిచ్చినట్లుగా, దేవుడు నాకు వివేకము కలిగిన గుణవతియైన భార్యను ఒక వరముగా అనుగ్రహించాడు. నన్ను అర్థంచేసుకుని, అన్ని వేళలా నాకు సహధర్మచారిణియై, మా కుటుంబ గౌరవానికి వన్నె తేవటంలో నా భార్య కలిగిన గుణలక్షణములు ఎంతో ఆదర్శప్రాయమైనవి.

దేవుడు మా కుటుంబ జీవితాన్ని ఆశీర్వదించి మాకు చక్కని బిడ్డలను అనుగ్రహించాడు. మా దాంపత్య జీవిత ప్రారంభంలో మేము కొంత వేదనకరమైన పరిస్థితులు భరించాల్సి వచ్చింది. ఎందుకనగా నా భార్యకు మొదటి మూడు కాన్పులలో ముగ్గురు ఆడ బిడ్డలు జన్మించారు. అందులో పెద్ద పాపకు బాల్యదశలోనే రెండు కండ్లకు పొరలు వచ్చి కంటి చూపు లేకుండా పోయింది. ఆ బిడ్డ విషయంలో చాలా దుఃఖాన్ని భరించాల్సి వచ్చింది. ఆ బిడ్డ 3 సం॥ల తొమ్మిది నెలలు బ్రతికిన తర్వాత చనిపోయింది. ఆ సంవత్సరములో ప్రభువు నాకు గొప్ప సహాయము చేసినట్లు నమ్మితిని.

ఆ బిడ్డ మరణానంతరం ఎంతగానో దుఃఖించి కృపగల దేవుని పాదాల చెంత విజ్ఞాపన చేయగా, దేవుడు మమ్మును ఎంతగానో ప్రేమించి వరుసగా నాలుగు కాన్పులలో చక్కని మగపిల్లలను అనుగ్రహించాడు. కానీ వారిలో రెండవవాడు జన్మించిన 10 నెలలకే చనిపోవటం జరిగింది. దేవుని సన్నిధిలో ప్రార్థించగా దేవుడు మరలా మమ్మును ఎంతగానో దీవించాడు. తరువాత మూడు కాన్పులలో వరుసగా ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు. తదుపరి మూడు కాన్పులలో ముగ్గురు మగబిడ్డలు జన్మించారు.

1934వ సంవత్సరం నుండి 1955 వరకూ 13 కాన్పులు జరుగగా, ఆ బిడ్డలలో ఒక ఆడబిడ్డ, ఒక మగబిడ్డ

చనిపోయారు. దేవుని యొక్క సంరక్షణను బట్టి, ఆశీర్వాదములను బట్టి ఆరుమంది మగపిల్లలు మరియు అయిదు మంది ఆడబిడ్డలు సజీవంగా ఉన్నారు. దేవుని ప్రాపకంలో వారందరూ పెరిగి పెద్దవారై సంతోషంగా జీవిస్తున్నారు. నేను, నా భార్య మా బిడ్డలందరి కోసం నిరంతరం ప్రార్థిస్తూ ఉండగా కీర్తన 85:12లో సెలవిచ్చినట్లుగా – అందరికీ ఉత్తమమైన దీవెనలను దేవుడు అనుగ్రహించాడు.

నాకు పెండ్లి అయిన తరువాత మా కుటుంబంలో నా కంటే చిన్నవారైన నా తమ్ముళ్ళు, చెల్లెళ్ళ విద్యాభ్యాసం విషయమై నేను ఎక్కువ శ్రద్ధ వహించి, నేను – నా తండ్రి కుటుంబము కొరకు, నా అన్న కుటుంబము కొరకు, నా కుటుంబము కొరకు ఎక్కువ శ్రమపడవలసి వచ్చింది. పిల్లలందరి విద్యాభ్యాసము కొరకు 1933 వ సంవత్సరం నుండి 1944వ సంవత్సరం వరకు దాదాపుగా 11,12 సంవత్సరములు ఎంతగానో కష్టపడ్డాము. ఆ దినములలో నేను ప్రతిరోజూ 40 నుండి 50 మైళ్ళ దూరం సైకిలుపై ప్రయాణించి వ్యాపారపు వ్యవసాయ పనులు చక్కబెట్టవలసి వచ్చింది.

శక్తికి మించి ప్రయాసపడుటవలన 1944వ సం॥ ఏప్రిల్ నెలలో నాకు న్యుమోనియా జ్వరం వచ్చి, దాదాపు రెండు నెలలు పనికి పోలేకపోతిని. శక్తిగల దేవుని సన్నిధిలో ప్రార్థించగా దేవుడు నన్ను స్వస్థపరిచాడు.

**సమైక్య కుటుంబ ప్రార్థనా శక్తి :-**

మా కుటుంబములు అన్ని విషయములలో వర్ధిల్లటానికి మూలకారణం – మా కుటుంబ ప్రార్థనే! ఎన్ని శ్రమలెదురైనా, ఎన్ని ఆటుపోట్లు మా కుటుంబాలలో, వ్యాపారములలో సంభవించినా ప్రార్థనా శక్తి ద్వారానే పరిష్కరించుకునేవారము. ప్రతి శ్రమలో, నష్టములో మా విజయానికి మూలకారణం దేవుని సన్నిధిలో మేము చేసుకునే ప్రార్థనే!

నా జీవితంలో నేను ప్రతి విషయంలో అభివృద్ధిని, శ్రమలో దేవుని ప్రోత్సాహాన్ని అనుభవించటానికి నిత్యకృపను దేవుడే నాకు ప్రార్థన ద్వారా అనుగ్రహించాడని నా పరిపూర్ణ విశ్వాసం. నా వివాహం అనంతరం అనేక సంవత్సరాలు నా తండ్రితోనే కలిసి ఉంటూ అన్ని విషయాలలో ఆయనకు నేను, నాకు మా తండ్రి ఒకరి కొకరము తోడుగా సంసార నౌకను సాగించాము. 1949 సం॥ సెప్టెంబరు 30వ తేదిన మేము వేరైనాము. మేము వేరైన తరువాత కూడా మా తండ్రిగారికి కొంత ఆర్థికసహాయం ఆయన మరణపర్యంతం కూడా చేసితిని.

నేను, నా భార్య, నా కుమారులు, నా కుమార్తెలు కలసి దేవుని సన్నిధిలో, వాక్యములో, ప్రార్థనలో ఎంతో బలపడుటకు దేవుడు కృపజూపినారు. దేవుని సమయోచిత సహాయమునుబట్టి నా కుమారులు, కుమార్తెల యుక్త వయస్సులో వారికి చక్కగా వివాహములు చేయగలిగాము. వీరిందరి వివాహములు 1952సం॥ అక్టోబర్ మాసం నుండి 1975సం॥ జూన్ మాసంలో అందరి వివాహాలు పూర్తి అయినాయి. దేవుడు నా కుమారుల, కుమార్తెల కుటుంబాలను ఆశీర్వదించి, చక్కని సంతానమును అనుగ్రహించాడు. అందుకు దేవునికి మహిమకలుగును గాక!

అందరికి ప్రభువు సంతానాన్ని అనుగ్రహించారు. మేమంతా క్షేమంగా ఉన్నాము. రెండవ కుమార్తె పెద్ద కుమారుడు సి. సుభాకర్ రెడ్డికి బలపనూరులో వివాహం జరిగింది. 1972 సం॥లో ఈ వివాహం జరుగగా వారికి ఒక మగబిడ్డను, ఒక ఆడబిడ్డను ప్రభువు అనుగ్రహించాడు.

1977 సం॥ ఫిబ్రవరి నెల 3వ తేది తెల్లవారు జామున బెంగుళూరు సమీపంలో జీపు యాక్సిడెంట్ జరిగి, శరీరమంతా గాయాలై పక్షవాతం వచ్చింది. వీరి తండ్రి సుబ్బారెడ్డిగారు కొన్ని లక్షలరూపాయలు ఆరోగ్య విషయమై ఖర్చుచేసారు. కాని ఆరోగ్యం చక్కబడలేదు కాని ప్రభువు కృపవలన మాట్లాడగలడు. కొంచెం ఆరోగ్యంగా ఉన్నారు. తన పని తాను చేసుకోలేడు. ఇతరుల సహాయం అవసరమై ఉంది. అతని సంపూర్ణ స్వస్థత కొరకు ప్రార్థించుచున్నాను.

నాకు ఇప్పుడు 74 సం॥రాలు. 1987 జూలై నెల 12వ తేదికి 75 సం॥ నిండుతాయి. 1987 డిసెంబర్ 29వ తేదికి నా వివాహమై 55 సంవత్సరాలు పూర్తి అవుతాయి.

(సశేషం)

# శ్రమల కొలిమి - సేవాపరిచర్యలో దేవుని నడిపింపు

శ్రీమతి రత్నకుమారి, కరీంనగర్

జగతి పునాది వేయబడక మునుపే ఆయన మనలను ఎరిగియుండెను. ఏది జరిగిన ఆయన నడిపింపే, దేవుని పిలుపు ఉన్న వారికి.

నా చిన్ననాటి నుండి నా దర్శనాలు వాక్య ప్రకారమైనవి. నాకు బైబిల్ పరిచయం లేనప్పుడు వచ్చిన దర్శనాలు బైబిల్ చదవడం ప్రారంభించినప్పుడు నేను ఆశ్చర్యపోతుండేదాన్ని.

ఉదా:-(1) నేను కలలో బైబిల్ సంచి తగిలించు కొని వెళ్ళుతున్నాను. మొత్తం తారు రోడ్డు వచ్చింది. నేను ఒక్క అడుగు వేశాను. మొత్తం పాములు, తేళ్ళు. అయిన భయపడక వాటిని కాళ్ళతోనే త్రోసి కాలుపెట్టి స్థలం చేసుకొని వెళ్ళాను. అవి నన్ను ఏమి అనలేదు, ఏ హాని చేయలేదు. నేను ఒక చర్చిలోకి వెళ్ళాను. పాస్టర్‌గారు యేసుక్రీస్తు పుట్టుక గురించి ప్రకటిస్తున్నారు. నేను "అయ్యా! ఇప్పుడు ప్రభువు రాకడ వర్తమానం చెప్పాలి" అన్నాను మెళకువ వచ్చింది.

ఇలా ఏ దర్శనం వచ్చిన ఖచ్చితంగా లేఖనాలను గురించి ప్రభువు మాట్లాడేవారు.

నా తోడు సహవాసం కొరకు ప్రభుపాద సన్నిధిలో 9 నెలలు ఉపవాస ప్రార్ధనలో గడిపాను. నువ్వు నాతో మాట్లాడిన ప్రకారం నేను జీవిస్తాను అని ఆయన స్వరంతో మాట్లాడే వరకు నేను ఉపవాసం విడువలేదు. నా ఆలోచన, నా ఇష్టం, కాదు. ప్రభువు ఇష్టమే నాలో జరుగును గాక! అని ప్రార్థించిన ఆరు నెలలకు ఆయన దర్శంలో చూపించి మాట్లాడిన వ్యక్తిని నా తండ్రిగారు దైవజనుల సమక్షంలో చర్చిలో మా వివాహము జరిగినది. ఆయన గొప్ప విశ్వాసి నన్ను ఈ లోకరీత్యా స్త్రీగా కాక దైవజనురాలుగా గౌరవించి, ప్రేమించే వ్యక్తి.

మేమిద్దరం కలిసి సేవ పరిచర్యలో సాగిపోవాలి, ప్రభువుని మహిమ పరచాలి, క్రీస్తు సాక్షిగా ఈ లోకములో నిలవాలి అని ఇద్దరం తీర్మాణం చేసుకున్నాము.

మేము ఎక్కడ ఉండాలి? ఏ విధమైన పరిచర్య ప్రారంభించాలి అని ప్రభువు సన్నిధిలో కనిపెట్టాము.

నాకు దర్శనములో ఒక మేఘము సి.యస్.ఐ. చర్చి గోడకు ఆనుకొని, ఆకాశం దాక వ్యాపించింది. అందులో చిన్న చిన్న నక్షత్రాలు పైకి, క్రిందకి దిగుచున్నవి. ఆ ప్రాంతమంతా కూడ నాకు చూపించాడు.

కాని నాకు సి.యస్.ఐ. సంఘం ఇష్టం లేదు. అక్కడ అంతా కోటిశ్వరులు, చాల పలుకబడి ఉన్న వ్యక్తులు. కాని చాల మురికి వీధులు, ఇళ్ళు అసహ్యాంగా అంతా పశువు పేడ కొట్టాలు, దోమలు, ఈగలు పెద్ద పెద్ద బల్లులు ఉంటాయి. అక్కడ వెళ్ళాలంటే అది అగ్ని పరీక్షనే! అయిన ప్రభువు చూపించాడు. నీ మేరకు ఈ ఊరంతా ఏకమై నిన్ను తరుముతారు, ద్వేషిస్తారు, సాతాను ధ్వజమెత్తుతాడు. కాని భయపడకు నేను నీతో ఉన్నాను. నీ మీద వారు జయం పొందలేరు అని గొప్ప దర్శనం చూపించాడు.

ధైర్యం చేసుకొని ఆ సంఘం దగ్గరలో ఇల్లు వెతికితే దొరికింది. ఆ సంఘకాపరి గారు ఎంతో ప్రేమగా నాకు సండేస్కూల్ చెప్పమని పిల్లలను అప్పగించారు. అప్పుడ ప్పుడు ఆ కాపరిలేని సమయంలో నేను నా భర్త మందిరాన్ని నడిపించేవారము. 10,15 మంది సంఘానికి వచ్చేవాళ్ళు. మేము వచ్చిన దగ్గర నుండి 70,80 మంది వస్తున్నారు. అందరు మేడమ్ గారు చాలా బాగ వాక్యం చెబుతారు, అమ్మ మంచిది అనేవాళ్ళు. ఆ పొగడ్తలకు నేను పొంగి పోలేదు. ప్రభువు హెచ్చరిక నాకు అనుక్షణం జ్ఞాపకం వస్తుండేది. దాని విషయం కూడ ప్రార్ధనలో ఉంచేదాన్ని. నేను, నా భర్త ఈ పరిచర్యలో ఎప్పటికో అన్నం తినేవాళ్ళం. ఒక్కొక్కసారి రాత్రి పన్నెండు కూడ అయ్యేది.

మేము వెళ్ళినప్పుడు ఆ సంఘస్థులు క్రైస్తవులనే పేరే కాని వాళ్ళ ఇళ్ళలో విగ్రహాల ఫోటోలు ఉండేవి. మాకు యేసయ్య కూడ దేవుడే అనేవాళ్ళు. కాని, యేసయ్య అంటే తెలియదు. అన్ని దేవుళ్ళలో యేసయ్య ఒక్కడు అంతే!

ఆయన్ని అంత గొప్ప చేసి చెప్పక్కరలేదు అనే భావన వాళ్ళందరికి.

నాకు – వాళ్ళను ఆ భావనలో నుండి క్రీస్తు శక్తి ఏమిటో తెలియజేయాలనే తపన ఉండేది. నా ప్రభువు నాలో ఉండి నడిపించేవాడు. శక్తితో వాక్య పరిచర్య జరిగేది. అనేక ఆత్మలు వెలిగించ బడ్డాయి. కుండలు బద్దలు కొట్టినట్లు నిర్మొహమాటంగా ప్రభువుపరిచర్య అక్కడ ప్రభువు చేశాడు. ఏ మాత్రం కూడ భయపడలేదు. పరిశుద్ధాత్ముడు అలా పనిచేశాడు. మనకు ప్రభువు పిరికితనమైన ఆత్మను ఇవ్వలేదు. దత్తపుత్రాత్మను ఇచ్చాడు అనే భావనతో మేము పరిచర్య చేశాము. నా భర్త, నేను మా ఇద్దరికి ఒకే తలంపై ఒకే ఆలోచనలు, అభిరుచులు దేవునికి స్తోత్రం.

ఇక సాతానుడు విజృంభించాడు. 4, 5 గ్రామాల సాయిభక్తులు ఆర్.యస్.యస్., బి.జె.పి. పెద్దలు, సర్పంచి దగ్గరకు నన్ను పిలిపించారు. నువ్వు గవర్నమెంటు ఉద్యోగివి అయి ఉండి నువ్వు మతప్రచారం చేసి మా పిల్లలను మతంలోకి లాగుతున్నావు అని నన్ను నిలదీశారు. నేను ఒక్కదానికి కూడ జవాబు చెప్పలేదు. అక్కడ దాదాపు ముప్పై మంది పెద్ద మనుష్యులు ఉన్నారు. సర్పంచి ఏదైన సమాధానం చెప్పమన్నారు. నేను నోరు విప్పలేదు. వాళ్ళే మళ్ళీ ఒక్కసారి నీ పేరు వినబడితే నీ ఉద్యోగ విషయంలో చాలా నష్టపోతావు జాగ్రత్త అని వెళ్ళిపోయారు.

ఒక ఆదివారము సంఘకాపరి సండేస్కూలు వద్దు, చర్చిలో కూర్చోమన్నారు. వచ్చి కూర్చున్నాను. సంఘస్తు లందరితో నా గురించి మాట్లాడుతు ఒక సేవకురాలు రెండో పెళ్ళి చేసుకోవచ్చా అని అందరి ముందు నన్ను ప్రశ్నించారు. నేను ఇంటికి వెళ్ళిపోయాను. వాక్యపరంగా భర్త చనిపోయిన స్త్రీ ప్రభువునందు వివాహం చేసుకోవచ్చు అని ఉంది. కాని నేను ఏ జవాబు ఇవ్వలేదు.

నేను ఇక ఏ సంఘానికి వెళ్ళను. నేను నీ పరిచర్య చేయలేనని ప్రార్థిస్తు ఇంట్లోనే ఉన్నాను. అయితే ఆశ్చర్య రీతిలో ఆ పిల్లలంతా నా ఇంటికి సండే రోజు వచ్చేవాళ్ళు. దాదాపు 40,50 మందిదాక వచ్చేవాళ్ళు. నేను ఏమి చెప్పకుండా పంపేదాన్ని. నాకు చాల బాధగ ఉండేది. ఈ పిల్లలకి ఏమి చెప్పక ఇలా పంపవచ్చా? నా మనస్సు అంగీకరించక కొన్ని సండేస్కూలు పాటలు, కథలు చెప్పి పంపేదాన్ని, కాని దేవుడే ఈ బిడ్డలను పంపాడు అనుకో వడం లేదు. ఆదివారం కనీసం స్నానం అయిన చేసి చీర కట్టుకొని భోదించేదాన్ని కాదు. దిగులుతో అలాగే నైటీ మీదనే వాళ్ళకు సండేస్కూలు చెప్పేదాన్ని. చాలా దిగులుగా ఉండేది.

ఒక ఆదివారము పిల్లలందరికి సండేస్కూల్ చెప్పి వచ్చి నేను పడుకున్నాను. నా భర్త పిల్లలకు ఏమో చెబుతు కూర్చున్నాడు. నేను నిద్రపోలేదు కళ్ళుమూసుకున్న "ఇద్దరు స్త్రీలు తెల్ల చీరలు కట్టుకొని పిల్లల మధ్య కూర్చోని ఏమో చెప్పి, నా దగ్గరకు వచ్చి అమ్మ మీ సంఘం నిమిత్తం కూడ దేవుని దగ్గర కానుక చెల్లించాము" అన్నారు. నేను కళ్ళు తెరచి "ఇది సంఘమా దేవా! నీకు స్తోత్రం నాయన!" అనుకున్నాను.

అప్పటి నుండి పిల్లలు 70,80 మందిదాక వస్తున్నారు. అప్పుడు ఎండకాలం పిల్లలకు బడి సెలవులు. రోజు ప్రొద్దున వస్తే అన్నం తిని మళ్ళీ వచ్చి సాయంత్రం దాక ఉండేవాళ్ళు. ఇదంతా చూసి సంఘకాపరి ఒక స్త్రీని నియమించి, సండేస్కూల్‌కి ఎవరు వస్తారో వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి పిల్లలకు చాక్లెట్లు ఇస్తూ, గిఫ్టులు ఇస్తూ పిల్లల్ని అమ్ముకొని అమెరికా నుండి ఈ గిఫ్టులు తెప్పిస్తుంది. మీ పిల్లల్ని పంపవద్దు అని చెప్పించారు. తరువాత ఆదివారం నుండి 30,25 మంది వస్తున్నారు. నాకు ఆశ్చర్యమేసింది. అసలు విషయం నాకు పిల్లలు చెప్పారు. మేడమ్ మీరు పిల్లల్ని అమ్ముకుంటారని పాస్టరయ్య యేసు, మణి అమ్మతో చెప్పించారు. మేము మా పిల్లల్ని పంపము మీరు కూడ పంపవద్దు. ఆ మేడమ్ ఎక్కడ నుండి వచ్చిందో మనకు తెలియదు. ఆమె మంచిది కాదు అని చెప్పించారని పిల్లలు నాతో చెప్పినప్పుడు ఒక్కసారిగా షాక్ తిన్నాను, కృంగి పోయాను.

నా జీవితంలో అనుకోని షాక్ అది. అయిన నా

**తరువాయి భాగం 19వ పేజీలో**

# శతాధిక తెలుగు బాప్టిస్టు సంఘము

రావూరి కృపారావు రిటైర్డ్ హెడ్మాస్టరు, బాపట్ల

క్రైస్తవ ప్రపంచలో తెలుగు బాప్టిస్టు సంఘానికొక విశిష్టమైన ఘనచరిత్ర ఉంది. క్రీ.శ.19వ శతాబ్ధంలో ప్రారంభమై, దక్షిణాన చెన్నపట్నం నుండి ఉత్తరాన నాగాల్యాండ్ వరకు విస్తరించి, గణనీయమైన వారసత్వాన్ని పుచ్చుకొన్న సంఘమే ఈ మన "అమెరికన్ బాప్టిస్టు మిషన్" దాని పురోభివృద్ధికి అలయక కృషిసల్పిన స్వదేశి, విదేశి మిషనెరీల త్యాగమయసేవలు మరువలేనివి.

"వారి త్యాగఫలితమే ఇప్పటి మన విద్య, ఉద్యోగం, నాగరికత, నాణ్యత. అంటరానివారముగా అల్లంత దూరాన ఉన్న మనం, మన్నికగా మనుషుల్లో మనగల్గుతున్నాం. కాని వారు ఆనాడు స్థాపించిన ఆ సంఘాలు, సంస్థలు, దినదినం కుంటుపడుతూ కూలిపోతున్నాయి. ఆస్థులు ఆక్రమణ పాలవుతున్నాయి".

ఒకనాటి మన కిరీటాలుగా నున్న క్లౌవ్ మెమోరియల్ హాస్పిటల్, ఒంగోలు బాప్టిస్టు క్రిష్టియన్ హాస్పిటల్, నెల్లూరు మిషను హాస్పిటల్, హనుమకొండ, ఏవి? ఏమైయ్యాయి? బాప్టిస్టు వారికి తలమానికగా నుండి, ఎందరో దైవసేవకులను తీర్చి దిద్దిన రామాపట్టణంలోని సెమినెరీ ఏది? ఇప్పుడు ఏస్థితిలో ఉంది. ఆ కాంపౌండులో దేవ దూతలుగా సంచరించిన, ఆత్యాగదనులు, మిషనెరీలు నివసించిన "బంగ్లాలు" ఏవి? ఎలా నేల మట్టం ఎలా అయ్యాయి?

భూలోక స్వర్గంగా ఉన్న కొడైకెనాల్‌లోని మన తోటబంగ్లాలు ఏవి? ఎవరి ప్రాప్తమయ్యాయి? ప్రతి ఉదయం, సాయంత్రం మైలు దూరం వినిపించే స్తుతిగానాలు చేసిన విద్యార్ధిని, విద్యార్థుల 'బోర్డింగులు' ఏవి? ఇలా చెప్పాలంటే పోయిన ఘనత చాలా ఉంది.

శ్రీమతి దానం మెర్సీ ఇశ్రాయేలుగారు ఒకచోట ఈ విధంగా అంటున్నారు. "వీటన్నిటిని పునరుద్ధరించేవారు ఎవరు? ఆనాడు మన పూర్వికుల త్యాగఫలితాన్ని తర తరాలుగా అనుభవిస్తూనే, వారిని మరచిపోయే కృతఙ్ఞులుగా నుండక, వారందించిన వెలుగును ఇంకా అనేకులకందిస్తూ, వారు స్థాపించిన సంఘాలను, సంస్థలను కాపాడుతూ ఉండడం తరతరాలవారి బాధ్యత, కర్తవ్యం. ఆ సత్యం చాలా మంది హృదయాల్లో కదలినా కరుడు గట్టినవారు కొందరైతే, చూస్తూ ఊరకుండిపోయిన వారు మరికొందరు.

మిషనెరీలు దేశం విడిచిపోతూ మన సంస్థలను వాటి బాధ్యతలను జాతీయ సంస్థ. అనగా "తెలుగు బాప్టిస్టు సంఘముల సమావేశం" (యస్.టి.బి.సి.)కి అప్పగించారు. ఆస్తులను మాత్రంకాదు. కొంతకాలానికి (యస్.టి.బి.సి.) మసిపారిందని, గతి తప్పిందని, ప్రక్షాళన చేస్తామని టి.బి.యఫ్.,యఫ్.టి.బి.సి. అనేవి వచ్చాయి. తెలుగు నానుడిని ధృడపరుస్తూ "ఆరంభ శూరులు"గానే పోయాయి. ఇటీవలనే అమెరికన్ బాప్టిస్టు ఫారిన్ మిషన్ సొసైటి ఆశీర్వాదంతో బి.సి.టి.సి. అనే సంస్థ వెలిసింది. మరి వీరేం చేస్తారో? వారి ప్రణాలికలేమిటో? వారు చెబితేగాని మనకు తెలియవు..!

ప్రకాశవంతమైన వెలుగును వెదజల్లిన మన "దీపాల"ను ఆర్పివేసి అపవాది పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు. అలనాటి వైభవాన్ని ఎరిగినవారు, అనుభవించిన వారు కొందరు. నేటి దుస్థితిని జీర్ణించుకోలేక కలత చెంది, చింతకలిగి మనవైన సంస్థలను ఉద్ధరించుకోవడానికి, ఏకమనస్కులై ప్రేరణ కలిగి మన సంఘాల తోడ్పాటుతో సంస్థను సంస్కరింప తలపోసి క్రింది కార్యాచరణతో ఉన్నారు.

1. మన సంస్థలను గూర్చి ప్రతి సంఘానికి, సభ్యునికి తెలియ పరచుట వారి బాధ్యతలను ఎరిగి, ప్రతి ఒక్కరు సంస్థను సంస్కరించుతో, పాలిభాగస్తులుగాను, వారి ప్రార్థనల బలముతో సాధించుట.

2. ప్రస్తుత నాయకులు, పెద్దలు వారి కార్యక్రమములు, మంచివైతే ప్రశంగిస్తూ, కాకుంటే ఖండిస్తూ సంఘములకు తెలియజేయుట.

3. బాప్టిస్టు యువతను క్రీస్తు రీతి భావినాయకులుగా సిద్ధపరచుట.

ఈ సదుద్దేశాలలో "బాప్టిస్టు సంఘ సంస్కరణ సమితి" అనే నామకరణముతో కృషి చేయ కదులుతున్నాను.

ప్రార్ధించండి. ప్రేరేపణ కలిగితే మాతో చేతులు కలపండి. ప్రభువు కొరకు మహిమకరమైన సేవ చేద్దాం.

**సెల్.నెం. 9885180160**

# బైబిల్‌లోని కిరీటములు

శ్రీమతి ఆలూరి నిర్మలా మాత్యూస్

1. పరిశుద్ధ కిరీటము – ప్రధాన యాజకుడు ధరించేది **(లేవీ.కా. 8:9)**
2. రాజు కిరీటము – దావీదు రాజు తలపై పెట్టబడెను. **(11సమూయేలు 12:29)**
3. రాజ్య కిరీటము – ఎస్తేరుకు రాజు ధరింపజేసి రాణిగా నియమించెను. **(ఎస్తేరు 2:15)**
4. బంగారపు పెద్ద కిరీటము – మొర్దెకై ధరించుకొనెను. **(ఎస్తేరు 8:15)**
5. పెనిమిటికి కిరీటము – యోగ్యురాలు**(సామె.12:4)**
6. సొగసైన కిరీటము – నీతిమంతులు కలిగియున్న నెరసిన వెంట్రుకలు **(సామెతలు 16:3)**
7. వృద్ధులకు కిరీటము – కుమారుల కుమారులు **(సామెతలు 17:6)**
8. దయా కిరీటము – సంవత్సరము **(కీర్తనలు 65:11)**
9. అతనికి పెట్టిన కిరీటము – సొలోమోను రాజుకు వివాహదినమున అతని తల్లి పెట్టెను. **(పరమ 3:11)**
10. అనేక కిరీటములు – పరలోకంలో యేసుక్రీస్తు శిరస్సు మీద ఉండెను. **(ప్రకటన 19:12)**
11. మహిమ ప్రభావములతో కిరీటము – యేసుక్రీస్తు ధరించినది. **(హెబ్రీ 2:9)**
12. భూషణకిరీటము, రాజకీయ కిరీటము – యెరూష లేములోని దేవునిప్రజలు **(యెష్య.62:3, జెక. 9:16)**
13. అతిశయ కిరీటము – విశ్వాసులు **(1థెస్స 2:19)**
14. అక్షయ కిరీటము – విశ్వాసులు పరలోకములో ధరించునది **(1కొరింథీ 9:25)**
15. నీతికిరీటము – విశ్వాసము కాపాడుకొనిన పౌలుకు, ప్రభువుప్రత్యక్షత అపేక్షించువారికి **(11తిమోతి 4:8)**
16. జీవ కిరీటము – శోధన సహించినవారికి **(యాకోబు 1:12)**
17. మహిమ కిరీటము – మందకు మాదిరిగా ఉన్న కాపరులకు **(1 పేతురు 5:4)**
18. ముళ్ళ కిరీటము – యేసుక్రీస్తు మన పాపముల నిమిత్తము సిలువలో ధరించెను **(మత్తయి 27:29), (మార్కు 15:17).**

# The Personal Word

The disiples are in their boat on lake Galilee in the middle of night. Suddenly they see a white figure in the distance and are dead scared, because they fear it is a ghost. However, as the figure comes closer, John says to Peter: It is the Lord.

At this moment Peter yells : If it is you Jesus, *call me to come to you!*

Interestingly enough Jesus did not issue a general invitation to anybody who wanted to come. It was a personal intimate NOW word to Peter, and Peter alone.

In the original, in the Greek there are two expressions for a word of God.

First there is **Logos**, the general word that is applicable to anybody.

Secondly there is **Rema**. This is the personal NOW word to an individual.

In Romans 10 where the Bible says that faith comes through hearing and hearing through the word of God, the expression used in the Greek is Rema not Logos. In other words, faith increases when we have the Rema word of God.

This Peter had, and that gave him the faith to step out on the water.

***Thank you father that you want us to have more Rema words, and that you are willing to give them to us.***

# లోకంతీరు

1

-చంటి

ఒక మనిషి జీవితం ఎంతో విలువైనది. మొదటి ప్రాధాన్యత ఆ మనిషి తనకు ఇచ్చుకున్న తర్వాతే ఇక మిగిలినవి. ఇది మనిషి సహజ గుణం. అంటే తను, తన కుటుంబం, తన బంధువులు, స్నేహితులు ఇలా తనకు సంబంధించిన వారి తర్వాతే ఏదైనా. ప్రాక్టికల్‌గా దీన్ని అధిగమించటం చాలా కష్టం. దేవున్ని నమ్మిన వాళ్ళు సైతం దీనికి అతీతులు కారు.

దేవుడు ఆదాము, హవ్వలను చేసిన తర్వాత మంచిచెడ్డల తెలివిని ఇచ్చే చెట్టును వేయకపోయినట్లయితే ఎలా ఉండేది? మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు వేయడంలో దేవుని ఉద్దేశ్యం ఏమై ఉంటుంది? దేవుడు మనిషిని ప్రేమిస్తున్నాడు అనటానికి గుర్తు మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టును వేయడం. మనిషికి ఇచ్చిన స్వేచ్ఛకి గుర్తు మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు. దేవుడు మనిషిని ప్రేమిస్తు న్నాడు, మనిషి దేవున్ని ప్రేమించాలి. అదే దేవుడు కోరు కునేది. ఆదాము, హవ్వలకు పరీక్ష మంచిచెడ్డల తెలివి ఇచ్చే చెట్టు. వారు దేవున్ని హృదయపూర్వకంగా ప్రేమిస్తే ఎలాంటి ప్రలోభాలకి లొంగకుండా దేవుని ఆజ్ఞ పాటించి పండు జోలికి వెళ్ళరు.

"మంచిచెడుల తెలివినిచ్చే చెట్టు" మనుష్యులు మంచిచెడ్డలు తెలుకోవాల్సిన అవసరం లేదని అర్ధం. అంటే తనకు ఏది మంచిదో, ఏది చెడ్డదో తెలుసుకోవాల్సిన అవసరం మనిషికి లేదని దేవుని ఉద్దేశం. మనిషికి ఏమి అవసరమో అవన్నీ దేవుడు సృష్టించాడు. మనిషిని చేసిన తర్వాత దేవుడు ఇక మనిషి అవసరాల కోసం ఏమి సృష్టించలేదు. మనిషి తినడానికి అనేక రకాలైన పండ్లు ఇచ్చాడు. కాబట్టి వాళ్ళు కడుపు నింపుకోడానికి మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు ఫలము తినాల్సిన అవసరం ఏమి లేదు. కాబట్టి మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు మనిషి విశ్వసనీయతకు ఒక పరీక్ష.

ప్రతి మనిషి జీవించడానికి అవసరమైనది మొదట ఆహారము. ముందు కడుపు నిండిన తర్వాతే మిగతా విషయాలు గురించి ఆలోచిస్తారు ఎవరైనా. బాగా ఆకలి అవుతుంటే మంచి బట్టలు వేసుకోవాలని కాని, ఖరీదైన ఇల్లు కావాలని కాని కోరుకోరు. కాబట్టి మనిషి మొదటగా ఆహారము విషయంలో నమ్మకముగా ఉండాలి. మనిషి ఆహారము వలన మాత్రమే కాక దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాట వలన బ్రతుకును అని నమ్మాలి. ఏలియాని దేవుడు పోషించాల్సి వచ్చినప్పుడు ముందుగా కాకుల ద్వారా ఆహారము పంపించాడు, తర్వాత పేద విధవరాలి ద్వారా పోషింపబడ్డాడు. కాబట్టి దేవుని మీద ఆధారపడిన వారికి దేవుడే పోషకకర్త. మన మంచి చెడ్డలను మనమే చూసుకో కుండా దేవునికి అప్పజెప్పినప్పుడు దేవుడు మన మంచి చెడ్డలను చూస్తాడు. సరే, దేవుడు మనిషికి తెలివితేటలు ఇచ్చాడు కదా! మన మంచిచెడ్డలు మనం చూసుకోకుండా అన్నిటికీ దేవుని మీద ఆధారపడాలా అని అనుకోవచ్చు. దేవుడు మనిషికి తెలివితేటలు ఇచ్చింది, తన సృష్టికర్త ఎవరో తెలుసుకొని ఆయన ఆజ్ఞల ప్రకారం నడుచుకోడానికే కాని, దేవుడిచ్చిన తెలివితేటలతో దేవునికి దూరమవమని కాదు.

సరే, ఇప్పుడు జరుగుతుంది ఏంటి? ప్రతి మనిషి తన తెలివితేటలతో తన అవసరాలు తీర్చుకోడానికి అంటే తిండి, బట్టలు, ఇల్లు, ఆస్తులు, స్థలాలు, పొలాలు, బంగారం ఇంకా తన అవసరాలకు మించి సంపాదించుకోడానికే తన జీవితం మొత్తం సరిపోతుంది. తనను సృష్టించిన దేవున్ని గురించి పట్టించుకోలేనంత బిజీగా సంపాదించుకోవడంతోనే జీవితకాలం ముగిసిపోతుంది. ఆదాము, హవ్వ అలా దేవుడు వారికిచ్చిన తెలివితేటలు కాకుండా, ఇంకా తెలివితేటలు సంపాదించడానికి, దేవుడు వారికిచ్చిన శాంతి సమాధానాలు కాదని దేవదూతల్లా వెలిగిపోవడానికి, దేవుడు వారికి సరిపోయినంతకంటే ఎక్కువగా తినడానికి ఇచ్చినా, దేవుని ఆజ్ఞని కాదని దేవుడు తినవద్దని చెప్పిన పండు తిన్నారు. అందువలన దేవుడు వారికి ఇచ్చిన ఆధిక్యతలన్నీ కోల్పో యారు. మనిషిని సృజించడానికి ముందే మనిషికి ఏమి అవసరమో అన్నీ సృష్టించాడు. మనిషిని సృజించిన తర్వాత ఇంకేమి సృష్టించలేదు. తను చేసిన పని అంతటి నుండి విశ్రమించాడు. అలాగే ప్రతి మనిషి నిద్రలేవడానికి ముందే మనిషికి అవరమైనవన్నీ దేవుడు సిద్ధం చేసి ఉంచుతాడు.

# నీ తండ్రిని నీ తల్లిని సన్మానించుము

1997లో మద్రాసు ఐ.బి.ఎల్.లో కూర్చొని ఉన్నాను. ఒక పాస్టరుగారు నా ప్రక్కన కూర్చుని నా చేతిలోని "జప్పత్పనేహ" నవల తీసుకొని చదవటం ప్రారంభించాడు. పదిపేజీలు చదివి దానికి రచయితను నేను అని తెలుసుకొని నా రచనలు 3 రకాలు, 100 ప్రతులు, విశాఖపట్నం, గోపాలపట్నం, చంద్రానగర్, సీయోను ప్రార్ధనా మందిరానికి పంపించమన్నారు. ఆయన పాస్టరు విజయానందం.

ఒంగోలు వచ్చిన తర్వాత పంపించాను. తర్వాత వారి సంఘము నుండి నాకు ఆహ్వానము మేరకు రైలులో విశాఖ ప్రక్కన సంహాచలం వెళ్ళాను.

విజయానందం ముఖం మరచిపోయాను. కంపార్టుమెంటు వాకిట్లో నిలుచున్నాను. బండి సంహాచలం స్టేషన్‌లో ఆగినది. ప్లాటుఫారం మీద నాకెదురుగా నిలుచున్న వ్యక్తి దగ్గరకు వెళ్ళి, "విదయానందం గారి మందిరం ఎక్కడుంది?" అని అడిగాను. ఆయన "నేనే" అన్నాడు.

ఇంటికి వెళ్ళాను. ఆ రోజు ఆదివారం. ఆరాధన అయిపోయిన తర్వాత విజయనగరం బయలుదేరాము. ఆయన కుమారుడు మత్తయిని పిలిచి, నాకిచ్చి పంపవలసిన కాగితాలను ఫోటోస్టాట్ తీయించి, సాయంకాలము నేను వెళ్ళే లోపల నాకు అందించమన్నారు. "ఈరోజు ఆదివారం కదండి ఫోటోస్టాట్ ఎలా తీస్తారు? బజారు చాలా దూరం కదా!" అన్నాను. "అబ్బాయి ఆ పని చేస్తాడు" అన్నాడు ధైర్యంగా.

"విజయనగరం ట్రైన్‌లో వెళ్తున్నాము. ఈ రోజు ఆదివారం కదా! మొత్తం ఎలా ఫోటోస్టాట్ తీయిస్తాడు" అని మరలా అడిగాను. "మనం విజయనగరం నుండి రాత్రికి వచ్చేటప్పటికి, ఫోటోస్టాట్ కాగితాలు బల్లమీద ఉంటాయి" అన్నాడు నిబ్బరంగా. ఆయన ముఖంలో ఆయన ఫోటోస్టాట్ కాగితాలు బల్లమీద చూస్తునంత ధీమా కనబరచి నందుకు కుమారుని మీద అంత నమ్మకమా! అని అనుకు న్నాను. "ఒకవేళ ఫోటోస్టాట్ షాపులు మూసి ఉంటే...!" అన్నాను. ఆ కాగితాలు మనం వచ్చేటప్పటికి బల్లమీద ఉంటాయండీ" అన్నాడు. అంతే రాత్రి 10 గంటలకు విజయనగరం నుండి ఇంటికి వచ్చేటప్పటికి ఆ కాగితాలు బల్లమీద ఉన్నవి.

ఆ తండ్రికి కుమారుని మీద ఎంత నమ్మకము. ఆ కుమారునికి తన తండ్రి మీద ఎంత గౌరవము. నా హృదయంలో ఆనాడు నాకు కలిగిన భావన ఇంతవరకు చెరిగిపోలేదు. విజయానందం గారి కుటుంబమంత దేవుని సేవలో ఉన్నారు. పిల్లలు అందరు సువార్త సేవకై బైబిలు సెమినరీలు చదువుకున్నారు.

దేవుని పది ఆజ్ఞలలో వాగ్దానముతో కూడిన ఆజ్ఞ నీ దేవుడైన యెహోవా నీ కనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తండ్రిని, నీ తల్లిని సన్మా నింపుము.

విజయానందంగారికి అయిదుగురు పిల్లలు. పెద్దబ్బాయి ఐజక్ కాకినాడలో గైగోలు ఎబినెజరు ప్రార్ధన మందిరములో పరిచర్య చేస్తూ, ఇండియా గాస్పిల్ మిషన్ పేరుతో బైబిలు కాలేజి నడిపిస్తున్నారు.

రెండవ కుమారుడు సాల్మన్‌రాజు విశాఖ గోపాల పట్నంలో తండ్రి నడిపించిన సంఘమును నడిపిస్తున్నారు.

పైన తెలియజేసిన మూడవ కుమారుడు మాత్యూస్ ఇప్పుడు కెనడాలో మాస్టర్ ఇన్ తిలూఫి చేస్తున్నాడు.

ఇద్దరు ఆడపిల్లలు పెద్దమ్మాయి ఎస్తేరు, రెండవ అమ్మాయి గ్లోరి. వీరిద్దరు బైబిలు కాలేజిలో చదివి వివాహములై దేవుని సేవచేస్తున్నారు.

విజయానందంగారు 2006వ సంవత్సరము రామ చంద్రాపురం చెన్నూరులో బేతేలు ప్రార్ధన మందిరము మీటింగులకు హాజరై, మంచి శుక్రవారం మధ్యహ్నం 12గం॥లకు వాక్యము చెప్పి దిగి వచ్చి కుర్చీలో కూర్చుని ప్రభువు సన్నిధికి చేరారు. ఆయన భార్య నయోమి అమ్మ గోపాలపట్నంలోనే రెండవ కుమారునితో కలసి సంఘ పరిచర్యలో ఉన్నారు.

# సువార్తలలోని యేసు కథ

ఒక మనుష్యుడు గొప్ప విందు చేసి, అనేకులను ఆహ్వానించాడు. విందు యజమాని విందుకు ప్రత్యేకమైన కారణము ఏమి చెప్పలేదు. తాను కొంతమందిని ఏర్పాటు చేసుకుని, వారితో తన సంతోషాన్ని పంచుకోవాలని, వారితో కలసి ఉండాలని, వారిని ప్రేమించి ఆహ్వానించాడు. వారు ప్రత్యేకించబడిన యూదా ఇశ్రాయేలు జనాంగము. వారు దాస్యంలో ఉంటే ఆయన వారిని విడిపించి, అపాయకరమైన సర్పములున్న అరణ్యమార్గమున ఏ అపాయము రాకుండా మేఘస్తంభమును, రాత్రివేళ అగ్ని స్తంభమును వారి వెంట ఉండి, పాలు తేనెలు ప్రవహించు దేశములోనికి తీసుకుని వచ్చాడు.

ఆ రోజుల్లో, ఈ రోజుల్లో ధనవంతుల సంఘంలో ఘనులైనవారి పాదముల దగ్గర బ్రతుకుతున్న హీనమైన వారిని ప్రేమించి, వారిని లోకములో ఒక స్థాయికి తీసుకొని వచ్చి, తన సువార్త అనే విందుకు ఆహ్వానిస్తే, ఒకప్పుడు సంఘంలో వెలివేయబడి, ఊరి బయట ఉండి, ఇప్పుడు విద్యా, ఉద్యోగాలు సంపాదించి, విందు యజమాని సువార్త విందుకు ఆహ్వానిస్తే, వారందరు ఏకమనస్సుతో నెపము చెప్పసాగారు.

ఒకడు పొలము చూడ వెళ్తున్నానన్నాడు. ప్రభువు చూడ కన్నులు లేనివారిని నా విందుకు పిలువు అన్నాడు. ఒకడు ఎద్దులు కొన్నాను. వాటిని పరీక్షించ వెళ్తున్నానన్నాడు. ఎద్దులను కొనే స్థితి లేని బీదవారిని పిలవమన్నాడు. అట్లయితే పెండ్లి చేసుకోలేని అంగహీనులను పట్టణపు వీధులలోనికి, సందులలోనికి వెళ్ళి పిలుచుకొని రమ్మన్నాడు. దాసులు యజమాని మాటప్రకారం చేసి, “అయ్యా! విందు శాలలో ఇంక స్థలము ఉన్నది” అన్నారు.

దేవుడు మానవులను చేసిన నాడే వారిని ఆశీర్వదించి మీరు ఫలించి, అభివృద్ధిచెంది, విస్తరించి భూమిని నింపమన్నాడు. ఇప్పుడు నా ఇల్లు నిండునట్లు, ఊరు వదలి బయటకు వెళ్ళి రాజమార్గంలోనికి, కంచెలలోనికి వెళ్ళి లోపలికి వచ్చుటకు అక్కడి వారిని బలవంతము చేయ మన్నాడు వీరు అన్య జనాంగము. యేసుని ఎరుగనివారు వీరిని బలవంతము చేసి, నా ఇంటిని నింపండి అన్నాడు. ఏలయనగా పిలువబడిన ఆ మనుష్యులలో ఒకడును నా విందు రుచి చూడరు అన్నాడు.

ప్రభువు సువార్త విందు ఎల్లప్పుడు మనుష్యులను ఆహ్వానిస్తునే ఉంది. దప్పిగొనిన వారలారా నీళ్ళ యొద్దకు రండి. రూకలు లేనివారలారా మీరు వచ్చి కొని భోజనము చేయుడి. రండి! రూకలు లేకపోయినను ఏమియు ఇయ్యకయే ద్రాక్షారసమును, పాలను కొనుడి అని పిలుస్తుంటే, పిలువ బడిన వారందరు ఈలోక సంబంధమైన భూమి, ఇండ్లు, ఎద్దులు, భార్య, (కుటుంబం) విషయమని సాకులు చెప్తుతున్నారు. నిజానికి వాటిని అనుగ్రహించినది ఈ యజమానుడే అని వారు మర్చిపోతున్నారు.

పిలువబడిన ఆ మనుష్యులలో ఒక్కరైనను నా విందు రుచిచూడరని చెప్పిన ప్రభువే – నా యొద్దకు వచ్చు వానిని నేనెంతమాత్రము వెలుపలికి త్రోసివేయను అని సెలవిచ్చాడు. ఆయన పిలిచినప్పుడు రాని వారు తరువాత తమ మనస్సు మార్చుకొని ఆయన దగ్గరకు వస్తే, ఆయన తప్పక చేర్చుకుంటాడు.

▪ ▪ ▪

ఇప్పుడు యేసు యెరూషలేము వైపుగా ప్రయాణం సాగిస్తున్నాడు. ప్రజలు గుంపులు గుంపులుగా యేసుతో ప్రయాణం చేస్తున్నారు.

యేసు వాళ్ళవైపు తిరిగి – నాతో వచ్చేవాడు తన తల్లిదండ్రుల కన్నా, తన భార్య కన్నా, తన సంతానం కన్నా, తన తోబుట్టువుల కన్నా, చివరకు తన ప్రాణం కన్నా, నన్ను ఎక్కువగా ప్రేమించలేనివాడు నా శిష్యుడు కానేరడు. అంతే కాక తన సిలువను మోసుకొని నన్ను అనుసరించని వాడు నా వాడు కానేరడు అన్నాడు.

# దేవునికి కోపము పుట్టించిన 14 పరిస్థితులు

1. మోషే స్వంతబలము మీద ఆధారపడిన పలుకులలో - నిర్గమ 4:14
2. ఫరో యొక్క నాశనమునకు - నిర్గమ 15వ అధ్యాయము
3. ఇశ్రాయేలీయులు బంగారు దూడను సిద్ధపరచుకొని నప్పుడు - నిర్గమ 32:10-12,22; ద్వితీ 9:9-22
4. అన్యాగ్నిని దైవసముఖమునకు తెచ్చినప్పుడు - లేవి 10:1-11
5. ఇశ్రాయేలీయులు సణుగుటలో - సంఖ్యా 11:1.
6. మాంసాపేక్షయందు - సంఖ్యా 11:10.
7. ఇశ్రాయేలీయుల దురాశ - సంఖ్యా 11:31,33.
8. అహరోను, మిర్యాము పాపము చేసినప్పుడు - సంఖ్యా 12:12
9. కాదేషు అర్నేయలో దేవునికి విరోధముగ నిలుచుట - సంఖ్యా 14:1-35., 32:11-14
10. కోరహు యందు - సంఖ్యా 16వ అధ్యాయము
11. బిలాము క్రియయందు - సంఖ్యా 22:1-22
12. ఇశ్రాయేలీయుల విగ్రహారాధన మరియు వ్యభిచార మందు - సంఖ్యా 25:1-11
13. మోషే రెండుసార్లు బండను కొట్టుటచే - ద్వితీ 1:37, ద్వితీ 4:21.
14. అహరోను పాపము నిమిత్తము - ద్వితీ 9:20,21.

**డి. అబ్రహాం శామ్యేల్ శర్మ,**
**రిటైర్డ్ డిప్యూటీ చీఫ్ కంట్రోలర్ రైల్వే,**
**నిడుబ్రోలు.**




**ప్రసంగములు పత్రికలో ప్రచురణ కొరకు పంపవద్దు**

# చైనాలో క్రైస్తవుల నిర్బంధం

17 అక్టోబర్ : చైనాలోని బీజింగ్ ప్రాంతంలో ఓ హోటల్ పై పోలీసులు దాడిచేసి 30 మంది క్రైస్తవులను అదుపులోకి తీసుకున్నారు.

చైనా ఎయిడ్ వివరాల ప్రకారం: అక్టోబర్ 16 నుండి 25 వరకు కేప్‌టౌన్, సౌత్ ఆఫ్రికాలో జరిగే "ప్రపంచ సువార్తీకరణ" అనే సదస్సుకు చైనా నుండి 30 మంది గృహ సంఘాల నాయకులకు ఆహ్వానం అందింది. అయితే మధ్యలో వీరి ప్రయాణాన్ని కస్టమ్స్ వారు అడ్డుకున్నారు.

పోలీసులు అసంఘటిత కార్యకలాపాల నేరం క్రింద వీరిని అరెస్ట్ చేశారు. కొంతమందిని తరువాత విడుదల చేసినను ముఖ్య నాయకులను 25 తరువాత అంటే సదస్సు చివరి దాకా విడుదల చెయ్యరని తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని ఎక్కడికి తరలించారో వివరాలు వెల్లడి కాలేదు.

# చర్చి బిల్డింగ్ ధ్వంసం

14 సెప్టెంబర్ : గాస్పల్ ఫర్ ఏషియా సహకారంతో పాస్టర్ పాల్ జోసఫ్ మరియు సంఘస్తులు కట్టుబడి చేపట్టిన బిల్డింగ్‌ను 14 సెప్టెంబర్ నందు కొందరు క్రైస్తవ వ్యతిరేక దుండగులు దాడి చేసి ధ్వంసం చేశారు. వరుసగా రెండు రోజులు దాడిచేసి పూర్తిగా చర్చిని నేలమట్టం గావించారు.

ప్రభుత్వం వారి ద్వారా తగు అనుమతి పత్రాలు ఉన్నప్పటికి అనుమతి లేదని ధ్వంసం చేశారు.

తరువాత స్థానికులను బెదిరించి చర్చి కట్టడం మా మధ్య వద్దంటు ఒక ఫిర్యాదును వ్రాయించారు.

ఈ విషయమై పోలీసులను సంప్రదించగా వారు సహాయ సహకారాలు అందించలేదు.

# భూటాన్ లో క్రైస్తవునికి జైలు శిక్ష

6 అక్టోబర్, భూటాన్ : బుద్దుల దేశమైన భూటాన్‌లో యేసుక్రీస్తు సినిమా ప్రదర్శించినందుకు ప్రేమ్ సింగ్ గురంగ్ (40) ను అరెస్ట్ చేశారు.

సుమారు 4 నెలల క్రితం గురంగ్ జిగ్‌మెకోలింగ్ ప్రాంతంలోని గోన్‌గావ్ మరియు సిమ్‌ఖర్థా గ్రామాలలో యేసుక్రీస్తు సినిమా ప్రదర్శిస్తుండగా స్థానిక క్రైస్తవ వ్యతిరేకులు గురంగ్ పై పోలీసులకు ఫిర్యాదు చేసారు.

సంఘ విద్రోహ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నాడన్న నెపంతో అరెస్ట్ చేశారు. వాదనలు విన్న కోర్టు వారు భూటాన్ సమాచార, ప్రసార హక్కులను అతిక్రమించారని మీడియా యాక్ట్ 2006, సెక్షన్105(1) మరియు 110 సెక్షన్‌ల క్రింద 3 సంవత్సరాల జైలు శిక్ష విధించారు. అప్పీలు చేసుకునే అవకాశం ఉన్నప్పటికి ఆ స్వేచ్ఛను గురుంగ్‌కు అందివ్వలేదు.

North East West South వార్తలు

## క్రైస్తవుల పై దాడి, గర్భస్థ శిశువు మృతి

19 అక్టోబర్, కర్ణాటక : కర్ణాటకలో మరొకసారి బిజెపి పాలనలో క్రైస్తవ వ్యతిరేక శక్తులు తమ ప్రతాపాన్ని చూపించాయి. ఆగస్ట్ 15న క్రైస్తవ్యం అనే కలుపును పీకెయ్యండి అని పిలుపునిచ్చిన నాయకుల అడుగులకు తాళంవేస్తూ కోలార్ జిల్లాలోని చింతామణిలో క్రైస్తవులపై దాడి చేశారు. ఆ దాడిలో గర్భముతో ఉన్న స్త్రీ పై దాడి చేయడం వల్ల గర్భ విఛ్ఛితి జరిగింది.

బిబిసి మరియు సిడియన్ న్యూస్ ప్రకారం సుమారు 40 మంది క్రైస్తవ వ్యతిరేక తీవ్రవాదులు చింతామణిలోని ఒక స్కూల్‌లో జరుగుతున్న కార్యక్రమంపై దాడిచేశారు. సుమారు 7 గంటలపాటు పాస్టర్‌ను అతని భార్యను నిర్బంధించారు. ఈమె కడుపుపై తన్నడంతో రక్తస్రావం జరిగి గర్భవిఛ్ఛితి జరిగింది.

సిడిఎన్ కథనం ప్రకారం సమాచారం అందుకున్న పోలీసుల సమక్షంలో కూడా దాడి కొనసాగింది.

దాడి ముగిసిన తరువాత దాడిచేసిన వారిని కాకుండా గాయపడిన క్రైస్తవులను అరెస్ట్ చేయడం కొసమెరుపు.

## ఆలిండియా ఎ.ఐ.సి.సి. వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక

22 అక్టోబర్ ఒంగోలు : స్థానిక క్లౌపేట, కృపాదానం వీధిలోని ప్రభువు సంఘ ఆలయంలో జరిగిన మెన్స్ గేదరింగ్‌లో ఆలిండియా ఎ.ఐ.సి.సి. ప్రెసిడెంట్‌గా ఎఐసిసి వర్గాలు బిషప్. రెవ. డా॥ జోసఫ్ కొడవటికంటి గారిని ఎన్నుకున్నట్లు ఓ ప్రకటన విడుదల చేశారు.

నవంబర్ నెలలో హైద్రాబాద్‌లో జరిగె ఓ కార్యక్రమంలో ఐ.ఇ.ఆర్.ఎఫ్. ఫౌండర్ మరియు డైరెక్టర్ బిషప్. రెవ. డా॥ జోసఫ్ కొడవటికంటి గారు బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలియచేశారు.

ఈ కార్యక్రమంలో అమెరికా దేశం నుండి వచ్చిన బ్రదర్ టెడ్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.